

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 432 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 14 జూలై 2025 | వెల : 4/-

# కోట శ్రీనివాసరావుకు చివరి వీడ్కోలు

- మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు
- గత కొంతకాలంగా వయో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న తుదిశ్వాస విడిచారు.
- సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు



టాలీవుడ్ ఇండస్ట్రీలోనే ఈరోజు ఒక చీకటి రోజు అని చెప్పుకోవచ్చు. ఒక అద్భుత నటుడు ఈ లోకం నుంచి దూరమయ్యారు. విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు నేటి ఉదయం మరణించిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా వయో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన నేడు తుదిశ్వాస విడిచారు. దీంతో టాలీవుడ్ లో తీవ్ర విషాదం నెలకొంది. సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. లెజెండరీ నటుడు కోట శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన టాలీవుడ్.. కోట అంతిమయాత్రకు తరలివచ్చింది. సినీతారలు, అభిమానుల అశ్రునయనాల మధ్య కోట అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి.. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు చివరియాత్ర కొనసాగింది. కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా.. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాసరావు ఇవాళ ఉదయం తెల్లవారుజామును కన్నుమూశారు. విలక్షణ నటుడి మరణ వార్త విన్న టాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. కోట మరణం పట్ల మెగాస్టార్ చిరంజీవి, తనికెళ్ల భరణి, బాబు మోహన్, బ్రహ్మానందం సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు - మిగతా3లో



మల్లన్నపై దాడి.. కొత్త పార్టీ ప్రకటనతో

# రాజకీయ వేడి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బీసీ ఉద్యమాన్ని తప్పుబడుతూ మల్లన్న పలు వ్యాఖ్యలు
- మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాగృతి కార్యకర్తలు ఆగ్రహం
- దాడితో అప్రమత్తమైన తీన్మార్ మల్లన్న గన్‌మెన్‌లు గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు

హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న కొత్త పార్టీని స్థాపించనున్నట్లు ప్రకటించారు. బీసీలను ఏకం చేస్తూ ఈ పార్టీ భవిష్యత్ కార్యచరణ ఉంటుందని ప్రకటించడం పొలిటికల్ హీట్‌ను మరింత పెంచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బీసీ ఉద్యమాన్ని తప్పుబడుతూ - మిగతా3లో

# బొట్టుబొట్టులో రాజకీయం

- క్రెడిట్ పోరు మామూలుగా లేదుగా..
- గత బీఆర్ఎస్ సర్కార్ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది.
- ప్రాజెక్టుల నుంచి కాంగ్రెస్ సర్కార్ విడుదల చేస్తున్న ప్రతి నీటిబొట్టు తమ కష్టమే అంటోంది గులాబీ పార్టీ.
- నీటి విడుదల తమ పుణ్యమే అంటూ క్లెయిమ్ చేసుకుంటోంది బీఆర్ఎస్..



తెలంగాణ వాటర్ వార్‌లో నయా ట్రెండ్ షురూ అయింది. ప్రాజెక్టులు, వాటి ఖర్చుల లెక్కలు, అవినీతి ఆరోపణలు, అంకెలు-రంకెలు పక్కకుపోయాయి. ప్రస్తుతం నీటి పారుదల రాజకీయం ప్రవహిస్తోంది. ప్రాజెక్టుల చుట్టూ లేటెస్ట్ పొలిటికల్ రౌండ్ షురూ అయింది. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల విషయంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ప్రాజెక్టుల నుంచి కాంగ్రెస్ సర్కార్ విడుదల చేస్తున్న ప్రతి నీటిబొట్టు తమ కష్టమే అంటోంది గులాబీ పార్టీ. నీటి విడుదల తమ పుణ్యమే అంటూ క్లెయిమ్ చేసుకుంటోంది బీఆర్ఎస్.. లేటెస్టుగా భద్రాద్రి సీతారామ ప్రాజెక్ట్ నుంచి గోదావరి - మిగతా3లో



## అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు

- మోతాదుకు మించి వినియోగం
- ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి
- హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో మరింత ముప్పు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా అధ్యయనం



## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారధిగా సోనాలి మిశ్రా

- జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు
- సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం
- సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు.



## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

- సీఎం నీతీశ్ కుమార్
- మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు
- నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన
- 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం
- గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయింది

## మహిళలకు శుభవార్త

# గ్రామాల్లో అంతర్జాల సేవలు

- మరో కీలక బాధ్యత ఇవ్వనున్న ప్రభుత్వం!
- గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం టీఫైబర్ నెట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది
- వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.
- మహిళా సంఘాలకు టీఫైబర్ నెట్ బాధ్యతలు అప్పగించాలని యోచిస్తున్న ప్రభుత్వం
- ఆసక్తి గల సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారుల సన్నాహాలు



బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి

# యత్నించడం సమంజసమా?

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం
- గన్‌మెన్ కాల్పులపై విచారణ జరుగుతోంది





## కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు!

- గుర్తుతెలియని వ్యక్తులు తంపనూరు పోలీస్ స్టేషన్‌కు మెయిల్
- క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయని ఆ ఈ-మెయిల్
- తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు.

# అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో మోతాదుకు మించి ఉప్పు వినియోగం ఉంటోందని, దీని ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో ముప్పు మరింత పెంచుతోందని ఐసీఎంఆర్‌కు చెందిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమిడమాలజీ' శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉప్పు వినియోగం తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అధ్యయనం చేయడంతో పాటు తక్కువ సోడియం ఉన్న ప్రత్యామ్నాయ ఉప్పుపై దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం.. ఓ వ్యక్తి రోజులో 5గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ, భారత్‌లో పట్టణ ప్రాంతాల ప్రజలు రోజుకు 9.2 గ్రాములు తీసుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వినియోగం 5.6 గ్రాములుగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**సోడియానికి బదులు..**

ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లో కొంతభాగాన్ని పొటాషియం లేదా మెగ్నీషియం లవణాలతో భర్తీ చేయడం ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఎన్ఐఈ సీనియర్ శాస్త్రవేత్త డా.శరణ్ మురళి పేర్కొన్నారు. సోడియం తక్కువ తీసుకోవడం.. రక్తపోటును తగ్గించడంతో పాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్‌తో బాధపడేవారికి ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. రక్తపోటు దాదాపు 7/4 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుందని.. ఈ చిన్న మార్పు చాలా పెద్ద ప్రభావం చూపుతుందన్నారు.

**అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు**

ఐసీఎంఆర్ సాయంతో తెలంగాణ, పంజాబ్‌లలో మూడేళ్ల వ్యవధితో కూడిన అధ్యయనాన్ని ఎన్ఐఈ ప్రారంభించింది.



రక్తపోటు ఉన్న వ్యక్తుల్లో ఉప్పు తగ్గింపు ప్రభావాన్ని అంచనా వేయడం, దీనిపై కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి లక్ష్యాలతో దీన్ని చేపట్టినట్లు డా.గణేశ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం అధ్యయనం తొలి ఏడాదిలో ఉందని, క్షేత్రస్థాయి సన్నద్ధత, అంచనాలపై పనిచేస్తున్నామని చెప్పారు. దీనిపై గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలతో కలసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**లభ్యత తక్కువే..**

మార్కెట్‌లో తక్కువ సోడియం ఉప్పు లభ్యత? ధర ఎలా ఉందనే దానిపై చెన్నైలో 300 రిటైల్ దుకాణాల్లో ఎన్ఐఈ సర్వే చేపట్టింది. 28శాతం రిటైల్ దుకాణాల్లో, 52 శాతం సూపర్ మార్కెట్లలో లభ్యమవుతుండగా.. కేవలం 4శాతం చిన్న కిరాణా దుకాణాల్లోనే ఇది అందుబాటులో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, సాధారణ ఉప్పు ధర 100గ్రాములకు రూ.2.7 ఉండగా.. ఎల్ఎస్ఎస్ ధర రూ.5.6గా ఉందని వెల్లడైంది. తక్కువ సోడియం కలిగిన ప్రత్యామ్నాయాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు

# కాంగ్రెస్ కీలక సమవేశానికి సోనియా పిలుపు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజిక్ గ్రూప్ సమావేశం ఈనెల 15న జరుగనుంది. దీనికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షత వహించనున్నారు. సోనియాగాంధీ తన నివాసమైన 10, జన్‌పథ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు పాల్గొనున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈసారి అధికార, విపక్షా పార్టీల మధ్య వాడివేడిగా జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్



చేపట్టడంపై తీవ్ర ఆందోళన చేస్తున్న విపక్షాలు ఈ అంశాన్ని ఉభయసభల్లోనూ ప్రస్తావించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తరువాత జరుగుతున్న తొలి సమావేశాలు కావడంతో ఈ అంశాలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21తో ముగియనున్నాయి. తొలుత ఆగస్టు 12తో సమావేశాలు ముగుస్తాయని ప్రకటించినప్పటికీ ఆ తర్వాత మరో వారం రోజులు పొడిగించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీంతో లెజిస్లేటివ్ ఎజెండా ఎక్కువగానే ఉండచ్చని తెలుస్తోంది. ఆటమిక్ ఎనర్జీ రంగంలో ప్రైవేటురంగానికి మార్గం సుగమం చేసే కీలక చట్టాన్ని ఈ సమావేశాల్లో తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

## పాస్‌పోర్ట్, వీసా లేకుండానే విమానంలో సౌదీకి..

# ఎయిర్‌లైన్ కంపెనీకి ప్రయాణికుడి లీగల్ నోటీసులు!

పాక్‌లోని లాహోర్‌కు చెందిన షాజాహాన్ అనే యువకుడు కరాచీ వెళ్లేందుకు విమానంలో బయలుదేరాడు. పొరపాటున సౌదీ అరేబియాలోని జెద్దాకు చేరుకున్నారు. ఎయిర్‌లైన్స్ కంపెనీ నిర్లక్ష్యం కారణంగానే తాను జెద్దా నగరానికి చేరుకోవాల్సి వచ్చిందని ఆరోపించాడు. టికెట్ చెక్ చేసిన సమయంలో ఎయిర్ హోస్టెస్ తనను మరో విమానం ఎక్కే సమయంలో ఇంటర్నేషనల్ ఫ్లైట్ ఎక్కకుండా అడ్డుకోలేదని ఆరోపించాడు. డొమెస్టిక్ టెర్మినల్ వద్ద రెండు విమానాలు నిలిచి ఉన్నాయని.. తాను ఓ విమానానికి బదులుగా మరో విమానం ఎక్కినట్లు పేర్కొన్నారు. దాదాపు రెండుగంటల తర్వాత విమానం కరాచీకి చేరుకోకపోవడంతో సదరు ప్రయాణికుడు తన తప్పును తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది తనను నిందించారని సదరు వ్యక్తి పేర్కొన్నాడు. తనకు పాస్‌పోర్ట్ లేదని, వీసా లేకుండానే తాను సౌదీకి చేరానని చెప్పుకొచ్చాడు. ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం కారణంగా సౌదీలో తాను అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఆ దేశంలో ఎఫ్ఐఏ అధికారులు తనను విచారించారని.. తాను తిరిగి కరాచీకి చేరుకునేందుకు మూడురోజుల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో షాజాహాన్ ఎయిర్‌లైన్స్‌కు లీగల్ నోటీసు పంపాడు. ఎయిర్‌లైన్ తప్పు కారణంగా తనకు మానసికంగా, ఆర్థికంగా నష్టం జరిగిందని తెలిపాడు. అదనపు ప్రయాణఖర్చులు, అసౌకర్యానికి పరిహారం చెల్లించాలని



డిమాండ్ చేశాడు. లాహోర్ విమానాశ్రయం, పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ దర్యాప్తు ప్రారంభించారు. చెకింగ్, బోర్డింగ్ ప్రక్రియలో ఎయిర్‌లైన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ సంఘటన ఒక వ్యక్తి ఇబ్బందులు పడడమే కాకుండా పాక్‌లో విమాన ప్రయాణ భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పాస్‌పోర్ట్, వీసా లేకుండా విదేశాలకు ఓ ప్రయాణికుడు చేరుకోవడం ప్రత్యక్షంగా నిబంధనలు ఉల్లంఘించడమే. అయితే, ఇప్పటి వరకు ఎయిర్‌లైన్స్ స్పందించలేదు.

# భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక

**ఢిల్లీ:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు.అది భారత్‌లో కూడా కావచ్చని



వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు

## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారధిగా సోనాలి మిశ్రా




**న్యూఢిల్లీ:** మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు. భారత సైన్యంలోనూ ప్రవేశించి, తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలి మిశ్రా.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితు లయ్యారు. జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు. సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు. రైల్వే ఆస్తులను కాపాడటం, ప్రయాణికుల భద్రత తదితర విధులతో పాటు, వాటి బాధ్యతలను అధికారులకు అప్పగించే విషయంలో ఆర్పీఎఫ్‌కు సోనాలీ మిశ్రా తొలి మహిళా అధికారిగా విధులు నిర్వహించనున్నారు. సోనాలి మిశ్రా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిణి. ఆమె ప్రస్తుతం మధ్యప్రదేశ్ పోలీసు విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ (సెలక్షన్)గా పనిచేస్తున్నారు. కాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)1957లో పార్లమెంటు చట్టం ప్రకారం ఏర్పాటయ్యింది. దీనికి 1985, సెప్టెంబర్ 20న యూనియన్ సాయుధ దళం హోదా ఇచ్చారు. 2021 జూలైలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఏర్పాటుకు నాయకత్వం వహించిన మొదటి మహిళా కమాండర్‌గా సోనాలి మిశ్రా పేరొందారు.

## కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు!



కేరళ సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు తంపనూరు పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయని ఆ ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో సీఎం నివాసంలోని సెక్యూరిటీ సిబ్బంది పోలీసులు అప్రమత్తమయ్యారు. విస్తృతంగా తనిఖీలు చేసి అది ఫేక్ ఈ-మెయిల్‌గా తేల్చారు. బాంబు బెదిరింపు మెయిల్ రాగానే అధికారులు ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కానీ ఎలాంటి బాంబు జాడ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బెదిరింపు మెయిల్‌కు, తాజాగా వచ్చిన బెదిరింపు మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు. గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు. "ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం" అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.

## ఇద్దరు పనికిరాని బీజేపీ డిప్యూటీ సీఎంలు ఏం చేస్తున్నారు..? : తేజస్వి యాదవ్



ప్రముఖ వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనను మరువకముందే బీహార్ రాజధాని పట్నాలో మరో వ్యక్తి హత్యకు గురికావడంపై.. ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ స్పందించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా.. లేదా..? అని ప్రశ్నించారు. వరుస హత్యలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. 'వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనను మరువకముందే పట్నాలో ఇప్పుడు బీజేపీ నేత హత్యకు గురయ్యారు. దీనిపై ఏం చెప్తారు.. ఎవరికి చెప్తారు..? అసలు రాష్ట్రంలోని ఎన్డీఏ సర్కారులో ఏ ఒక్కరైనా నిజం తెలుసుకోవడానికి, తప్పులు ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారా..?' అని తేజస్వి ప్రశ్నించారు. సీఎం ఆరోగ్యం గురించి అందరికీ తెలుసని, కానీ ఇద్దరు పనికిరాని బీజేపీ డిప్యూటీ సీఎంలు ఏం చేస్తున్నారని మండిపడ్డారు.

# కోట శ్రీనివాసరావుకు చివరి వీడ్కోలు

-మొదటిపేజీ తరువాయి

చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో కోట అంతిమ సంస్కారాలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. కోట ఇక తిరిగిరారు అన్న విషయాన్నీ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. వీడ్కోలు.. నేస్తమా అంటూ కోటకు నివాళులు అర్పిస్తున్నారు.

**కోట శ్రీనివాసరావు మృతిపట్ల ప్రధాని మోదీ సంతాపం**

టాలీవుడ్ ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. కోట శ్రీనివాసరావు మరణం బాధాకరమని, ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞగా ఆయన గుర్తిండిపోతారని మోదీ కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.
'కోట శ్రీనివాసరావు గారి మరణం బాధాకరం. ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞకు గుర్తుండిపోతారు. తరతరాలుగా ప్రేక్షకులను తన అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో కూడా ఆయన ముందంజలో ఉన్నారు మరియు పేదలు మరియు అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారు. ఆయన కుటుంబానికి, అసంఖ్యాక అభిమానులకు నా సంతాపం. ఓం శాంతి.' అని



'ఎక్స్' ఖాతా ద్వారా సంతాపం తెలిపారు.

**పాత్ర ఏదైనా కోట మాత్రమే చేయగలరు**

టాలీవుడ్ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి చిరంజీవి ()సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు అయన ట్వీట్ చేశారు. మరికొద్ది సేపట్లో చిరు కోట ఇంటికి చేరుకోనున్నారు. 'లెజెండరీ యాక్టర్ , బహుముఖ ప్రజ్ఞా శాలి కోట శ్రీనివాస రావు గారు ఇక లేరు అనే వార్త ఎంతో కలచివేసింది. 'ప్రాణం ఖరీదు' చిత్రం తో ఆయన నేను ఒకే సారి సినిమా కెరీర్ ప్రారంభించాము. ఆ తరువాత వందల కొద్దీ సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రని తన విలక్షణ, ప్రత్యేక శైలి తో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారు కోట. కామెడీ విలన్, అయినా సీరియస్ విలన్ అయినా, సపోర్టింగ్ క్యారక్టర్ అయినా, ఆయన పోషించిన ప్రతి పాత్ర ఆయన మాత్రమే చేయగలడు అన్నంత గొప్పగా నటించారు. కొన్నేళ్ల క్రితం ఆయన కుటుంబం లో జరిగిన వ్యక్తిగత విషాదం ఆయన్ని మానసికంగా ఎంతగానో కుంగదీసింది. కోట శ్రీనివాస రావు లాంటి నటుడు లేని లోటు చిత్ర పరిశ్రమ కి, సినీ ప్రేమికులకి ఎన్నటికీ తీరనిది.ఆయన ఆత్మ కి శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకి, శ్రేయోభిలాషులకి, అభిమానులకి, నా ప్రగాఢ సంతాపం తెలియ చేస్తున్నాను' అన్నారు.

**ఆ ఘనత ఆయనకే దక్కుతుంది: నందమూరి బాలకృష్ణ**

కోట శ్రీనివాసరావు గారి మృతి పట్ల నందమూరి బాల కృష్ణ సంతాపం తెలియజేశారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. 1999లో విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ప్రజాసేవతోనూ మంచి నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరనిలోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. కోట శ్రీనివాసరావు గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అన్నారు.

## మహిళలకు శుభవార్త

# గ్రామాల్లో అంతర్జాల సేవలు

స్వయం సహాయక సంఘాల మహిళల(డ్వాక్రా సంఘాల) సేవలు త్వరలో మరో రూపంలో ప్రజలకు అందనున్నాయి. పొదుపుతో ఆర్థిక స్వావలంబన సాధించిన అతివలు చిరు వ్యాపారాలు, మహిళా శక్తి సెంటర్ల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం టీఫైబర్ నెట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం స్త్రీనిధి కింద లోన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ప్రయత్నం ఫలిస్తే గ్రామాల్లో అంతర్జాల సేవలు మరింతమంది ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆసక్తి కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**మిషన్ భగీరథతో పాటే**

గ్రామీణ ప్రాంతాలకు అంతర్జాలం సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్ నెట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చిన విషయం విదితమే. రాష్ట్రంలో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం పైపులైన్లు వేసే క్రమంలో వాటితో పాటే అదే కందకాల్లో ఫైబర్ తీగలను కూడా వేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి ఇంటికీ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించాలని భావించింది. దీనిని పర్యవేక్షించే బాధ్యతను టీఫైబర్ సంస్థకు అప్పగించారు. ఇప్పటికే టీఫైబర్ సేవలు కలెక్టరేట్లు, ఎంపీడీవో, పంచాయతీ ఆఫీసుల్లో ప్రయోగాత్మకంగా అందిస్తున్నారు. తాజాగా ప్రతి ఊరిలో సిగ్నల్ ఉందా? టీఫైబర్ పైపులు దెబ్బతిన్నాయా? ఇంటర్నెట్ వేగానికి కేబుళ్లు సరిపోతాయా? అన్న కోణంలో సంబంధిత సిబ్బంది పరిశీలిస్తున్నారు.

**సేవలు ఇలా:**

రూ.300కే 20 ఎంబీపీఎస్ వేగంతో 4జీ, 5జీ ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.



పాఠశాలలు, ప్రభుత్వం ఆఫీసులు, గ్రామంలో కోరిన వారికి నిర్వాహక మహిళలు కనెక్షన్లను ఇస్తారు.

రుణం అందించి : డ్వాక్రా సంఘాల సభ్యులకు దీని వల్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి మహబూబ్?నగర్? జిల్లాలో 48,264 మహిళా సంఘాలున్నాయి. 5.22 లక్షల మంది డ్వాక్రా సభ్యులున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వసతిని కల్పించేందుకు స్త్రీ నిధి కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల రుణం అందిస్తారు. మహిళలు ఊరిలో అవసరం ఉన్న వారికి కనెక్షన్?ను ఇస్తారు. స్వశక్తి మహిళలకు ఇంటర్నెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించటంపై కసరత్తు చేస్తున్నట్లుగా టీఫైబర్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నారాయణపేట జిల్లాలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సెలక్ట్? చేసి అమలు చేస్తున్నారు.

| జిల్లా | సంఘాలు | సభ్యులు |
|---|---|---|
| జోగులాంబ గద్వాల | 6,896 | 76,128 |
| మహబూబ్?నగర్? | 11,649 | 1,23,859 |
| నారాయణ పేట | 8,356 | 90,879 |
| నాగర్ కర్నూల్? | 13,633 | 1,46,916 |
| వనపర్తి జిల్లా | 7,730 | 84,456 |

**వడ్డీలేని రుణాల కోసం నిధులు విడుదల**

మహిళలకు గుడ్‌న్యూస్. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.344 కోట్లను విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమచేస్తున్నారు. ఈమేరకు రూ.300 కోట్లు గ్రామీణ మహిళా సంఘాలకు, రూ.44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్పటికే రుణాలు మంజూరు చేస్తోంది. దీనికితోడు వడ్డీలేని లోన్?లు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పురపాలికల పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసి పంపుతున్నారు. మళ్లీ పథకం పునఃప్రారంభం కానుండటంతో ఎంతోమంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. దీంతో మహిళాసంఘాల్లో కొత్త ఆశలు చిగురించాయి.

# తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై కవిత ఫిర్యాదు

**హైదరాబాద్:** ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)పై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికు ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు చేశారు. వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని గుత్తా నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "తెలంగాణలో ఆడబిడ్డలంటే ఎంతో గౌరవం ఉంటుందన్నారు. బీసీ బిడ్డల్లో గౌరవించే అవకాశం మెండుగా ఉంటుందన్న కవిత.. రాజకీయాల్లో మహిళలపై పురుష పదజాలం వాడడంతో రాజకీయాల్లోకి మహిళలు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. "తెలంగాణ జాగృతి విషయంలో బీసీ రిజర్వేషన్ల అమలుకై పోరాటం చేస్తూనే ఉన్నాం. మీరు బీసీ బిడ్డా కాబట్టి ఏదీ పడితే అదీ మాట్లాడితే సరికాదు. తీన్మార్ మల్లన్న మీరు మాట్లాడిన మాటలకు మావాళ్ళకు కోపం వచ్చి నిరసన చేశారు. ఇంత మాత్రనికే గన్‌ఫైర్ చేసి చంపేస్తారా!??. ఒక ఆడబిడ్డ ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారా !?. నేను ఊరుకునే ప్రసక్తే లేదు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే మీరు వెనకనుండి మాట్లాడించారని భావించాల్సి ఉంటుంది. వెంటనే చర్యలు తీసుకోవాలి" అని కవిత డిమాండ్ చేశారు. "ఇప్పుడు సెషన్స్ లేవు కాబట్టి.. మీరు ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేయాలని చైర్మన్ సూచించారు. వెంటనే తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ సభ్యత్వం నుండి సస్పెండ్ చేయాలి. 24 గంటలు గడిచిన ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం. ఎమ్మెల్సీ మహిళా నేతపై చేసిన వ్యాఖ్యలను పట్టించుకోకపోతే.. మిగతా సాధారణ మహిళల పరిస్థితి ఏంటీ? సీఎం, డీజీపీకీ రిక్వెస్ట్ చేస్తున్నా.. ఫైరింగ్



మీద పూర్తి ఎంక్వైరీ చేయాలి. గతంలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారు. తీన్మార్ మల్లన్న ఎవరు అసలు.. నన్నెందుకు అడ్డుకుంటాననీ అరుస్తూ గోలా గోలా చేస్తున్నాడు" అంటూ కవిత వ్యాఖ్యానించారు. కాగా, ఇవాళ ఉదయం(ఆదివారం) తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేసిన ఘటన సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. కాగా, 3.30 గంటలకు డీజీపీని కలిసి కవిత ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. మేడిపల్లిలోని తీన్మార్ మల్లన్న ఆఫీస్‌లో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో మల్లన్న గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు.

**తీన్మార్ మల్లన్న నాపై అసభ్య కామెంట్స్ చేశారు**

మలన్న కార్యాలయానికి చేరుకున్న పోలీసులు.. పరిస్థితిని అదుపు చేశారు. ఇరువర్గాలను ఆఫీస్ నుంచి పంపించివేశారు. కవిత చేపట్టిన బీసీ ఉద్యమాన్ని తప్పుబడుతూ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిపై స్పందించిన మల్లన్న తనపై కవిత అనుచరులు హత్యాయత్నం చేశారంటూ ఆరోపించారు. హత్యాయత్నాన్ని ఆపేందుకు తన గన్ మెన్ గాల్లోకి కాల్పులు జరిపారన్నారు.

## బొట్టుబొట్టులో రాజకీయం

-మొదటిపేజీ తరువాయి

జలాలను విడుదల చేశారు. అశ్వాపురం మండలం బీ.జీ. కొత్తూరు దగ్గర.. మొదటి లిఫ్ట్ పంప్ హౌస్ నుంచి గోదావరి జలాలు ప్రవహించాయి. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల ఆలస్యం కావడంతో.. పంటలు ఎండకుండా గోదావరి జలాలను విడుదల చేసినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఇదంతా తమ కష్టమే అంటోంది బీఆర్ఎస్. గతంలో కేసీఆర్ ముందుచూపుతో గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఫలాలు రైతులకు అందడం సంతోషంగా ఉందన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. సీతారామ ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసినట్టే, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి మోటార్లు ఆన్ చేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు హరీష్. ఈమేరకు ఆయన పోస్ట్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ నుంచి జలాల విడుదల క్రెడిట్ తమదేనంటూ చెప్పకనే చెప్పారు హరీష్.

**కల్వకుర్తి విషయంలోనూ సేమ్ సీన్**

ఇక కొద్ది రోజుల ముందు కల్వకుర్తి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. అప్పుడు కూడా ఇలాంటి ట్వీట్‌తోనే పొలిటికల్ హీట్ పెంచారు హరీష్. సాగునీరందక అవస్థపడుతున్న లక్షలాదిమంది రైతులతో తరలివచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటేగాని ప్రభుత్వంలో చలనం రాలేదని, తాము ప్రశ్నించాకే.. కల్వకుర్తి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అది తమ విజయమే అంటూ తమ ఖాతాలో వేసేసుకున్నారు హరీష్‌రావు. బొట్టుబొట్టులో రాజకీయంతో తెలంగాణ పాలిటిక్స్ వేడెక్కాయి.

## బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసమా?

**హైదరాబాద్:** ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ రెండింటినీ ఆయన ఖండించారు. కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని.. గన్‌మన్ కాల్పులపై విచారణ జరుగు తోందని తెలిపారు. కాంగ్రెస్ కృషి ఫలితమే బీసీ బిల్లు, రిజర్వేషన్లు అని మహేశ్‌కుమార్ చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసం కాదన్నారు.

## మల్లన్నపై దాడి.. కొత్త పార్టీ ప్రకటనతో రాజకీయ వేడి

-మొదటిపేజీ తరువాయి

మల్లన్న పలు వ్యాఖ్యలు చేశారు. మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిపల్లిలోని ఆయన ఆఫీస్‌పై దాడి చేశారు. అయితే, దాడితో అప్రమత్తమైన తీన్మార్ మల్లన్న గన్‌మెన్‌లు గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు.

**తెలంగాణ మరో కొత్త రాజకీయ పార్టీ**

జాగృతి కార్యకర్తల దాడిపై తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడారు. నాపై హత్యాయత్నం జరిగింది. నన్ను కాపాడేందుకు గన్ మెన్ ఫైర్ చేశారు. దాడి నాపై చేసి.. కవిత డీజీపీకి ఫిర్యాదు చేయడం సిగ్గు చేటు. పక్కా ప్లాన్ ప్రకారం దాడి చేశారు. దాడికి ఉసిగొల్పిన కవిత శాసన మండలి సభ్యత్వం రద్దు చేయాలి. త్వరలో రాజకీయ పార్టీ పెడతా.. బీసీలను ఏకం చేస్తానని తెలిపారు.

**గతంలో తెలంగాణ నిర్మాణ పార్టీ'**

2023లో తీన్మార్ మల్లన్న ఓ కేసులో భాగంగా చర్లపల్లి జైలులో శిక్షను అనుభవించారు. చర్లపల్లి జైలు నుంచి విడుదల అనంతరం 'తెలంగాణ నిర్మాణ పార్టీ' పేరుతో రాజకీయపార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో (2024) మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి తన పార్టీ తరఫున పోటీ చేస్తానని తెలిపారు.అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ప్రజల మనోభావాలు గౌరవించేందుకు కాదని, మహారాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశం కోసమేనని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చేది యువతేనని..రైట్ రీ కాల్ తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఇప్పుడు మరోసారి తీన్మార్ మల్లన్న తాను కొత్త రాజకీయ పార్టీని పెట్టనున్నట్లు ప్రకటించడం గమనార్హం.

## మహాకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి



సికింద్రాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరకు హాజరయ్యారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు సీఎంకు వేదాశీర్వచనాలిచ్చారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని రేవంత్‌రెడ్డి ప్రార్థించారు. మహాకాళి బోనాల జాతర ఘనంగా సాగుతోంది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా 6 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. నేడు బోనాలు, ఫలహారబండ్ల ఊరేగింపు, 14న రంగం, పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు జరగనుంది. ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సింగరేణి నిధులు ఈ ప్రాంతంలోనే ఖర్చు పెట్టేలా చట్టం తీసుకువస్తాం: మంత్రి వివేక్



**మందమర్రి:** సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం కేటాయించే డీఎంఎఫ్టీ నిధులు ఈ ప్రాంతంలోనే ఖర్చు చేసేలా త్వరలో చట్టం తీసుకువస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన బురదగూడెం, సుభాష్ నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. గడిచిన ఏడాది సింగరేణి సంస్థ రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించిందని పేర్కొన్నారు. జిల్లాలోని జైపూర్‌లో మరో 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్య కేంద్రాల ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సింగరేణి ఒప్పంద కార్మికులకు వేతనాల పెంపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

# ప్రైవేట్ సంస్థలకే నిర్మాణ బాధ్యతలు

భారత్–ఇంగ్లాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తితో చూస్తుండగా ప్రముఖ సిమెంట్ కంపెనీ వాణిజ్య ప్రకటన ట్యాగ్‌లైన్ ఒకటి నన్ను విశేషంగా ఆకర్షించింది. అదిలా ఉంది: '. ఇది నూటికి నూరుపాళ్ల సత్యం. అవును, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ విస్తరణ మధ్య బలమైన సానుకూల సంబంధముంటుంది. రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు మొదలైన వాటికి భవనాలు నిర్మించాలి. ఈ సామాజిక, సామూహిక సదుపాయాలను సమృద్ధిగా నిర్మించుకున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ విస్తరణ సాధ్యమవుతుంది. ఈ మౌలిక సదుపాయాలను మనం సత్వరమే అభివృద్ధిపరచుకోవాలి. అయితే వాటిని ఎలా నిర్మించుకోవాలో మనం తెలుసుకుని తీరాలి. జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప నిర్మాత. ఆయనను ద్వేషించేవారు చేస్తున్న విమర్శలు నయా పైసా విలువలేనివి. 1947లో మన దేశ జనాభా 34 కోట్లు. అక్షరాస్యత రేటు కేవలం 12 శాతం. తన 17 ఏళ్ల ప్రధానమంత్రిత్వ కాలంలో నెహ్రూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించారు. ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఉక్కు కర్మాగారాలు, ఐఓసీ, ఓఎన్‌జీసీ, ఎన్‌ఎల్‌సీ, హెచ్‌ఏఎల్, బీహెచ్‌ఈఎల్, ఇస్రో, భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ, ఇంకా ఎన్నో సమున్నత సంస్థలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలకు ఆయనే అంకురార్పణ చేశారు, నిర్మించి అభివృద్ధిపరిచారు. ఇదంతా జరిగింది స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలోను, అదీనూ విద్యా వ్యాప్తి చాలా తక్కువగా ఉన్న, సాంకేతికతలు అందుబాటులో లేని, మానవ వనరులకు నైపుణ్యాలు కొరవడిన కాలంలో అన్న వాస్తవాన్ని విస్మరించకపోతే నెహ్రూ నిర్మాణ సామర్థ్యం ఎంత మహోన్నతమైనదో అర్థమవుతుంది. నెహ్రూ నిర్మించినవి ఈ నాటికీ ఉన్నాయి, జాతి పురోగతికి అద్వితీయంగా దోహదం చేస్తున్నాయి. నెహ్రూ భారత్‌కు ఆర్థిక వనరులు తక్కువగా ఉండవచ్చునేమో కానీ, చిత్తశుద్ధి, అంకిత స్వభావం, ప్రతిభాపాటవాలు ఉన్న మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి. క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో చోళ చక్రవర్తి కావేరీ నదిపై గొప్ప ఆనకట్ట నిర్మించాడు. ప్రపంచంలో అత్యంత పురాతన ఆనకట్టలలో అదొకటి. నేటికీ ఉపయోగంలో ఉన్నది. వేలాది ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. అంతకంటే ముఖ్యంగా వరదల నియంత్రణకు ఇతోధికంగా తోడ్పడుతోంది. భారత్ నేటికీ ప్రతి రోజూ ఈ మహా నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నది. అయితే ప్రైవేట్ రంగంలో నిర్మాణాల, ప్రభుత్వ రంగంలో నిర్మాణాల నాణ్యత, మన్నిక మధ్య ఎంత వ్యత్యాసమున్నదో ప్రతి పౌరుడికీ బాగా తెలుసు. ఈ రెండు విధాల నిర్మాణ కార్యకలాపాలలోనూ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. అయితే వారు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు వేర్వేరుగా ఉంటున్నాయి. నిర్మాణ ప్రక్రియలూ భిన్నమైనవి. ప్రజల ధనంతో ప్రభుత్వ రంగంలో జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల తీరుతెన్నులను పరిశీలిద్దాం. ప్రైవేట్ నిర్మాణ కార్యకలాపాల నాణ్యత ఎంపిక చేసుకున్న ఆర్కిటెక్ట్, నియమించుకున్న కాంట్రాక్టర్, నిధుల లభ్యతపై ఆధారపడి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ నిర్మాణ కార్యకలాపాలు, మరీ ముఖ్యంగా జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులకు భూమి, నిధుల పరంగా అవరోధాలు ఉండవు. అయితే మనం చూస్తున్నదేమిటి? హైవేలు, కొత్త రోడ్లు నిర్మాణమయి అవగానే కుంగిపోతున్నాయి. మురుగునీటిని తీసుకువెళ్లే కాలవలు లేదా గొట్టాలు పగిలిపోయి రోడ్లపై మురుగునీరు వెల్లువెత్తుతోంది. దేశ రాజధానిలోని అశోకా రోడ్డులో గత 18 నెలల్లో మురుగునీటి గొట్టాలు పగిలిపోవడం, రోడ్డు కుంగిపోవడం మూడుసార్లు సంభవించింది. రోడ్లు గుంతలమయమైపోతున్నాయి. ఆ బాటల్లో ప్రయాణిస్తున్న వాహనాలు ఆ గుంతల్లో పడిపోతున్నాయి. గ్వాలియర్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఒక రోడ్డు 15 రోజులలోనే కుంగిపోయింది. గుజరాత్‌లోని మోర్బిలో మరమ్మతు నిర్వహించి వాహనాల రాకపోకలకు పునఃప్రారంభించిన ఒక వంతెన నాలుగు రోజులలోనే కూలిపోవడంతో 141 మంది మరణించారు. సరైన అర్హతలులేని కంపెనీకి ఆ వంతెన మరమ్మతు, పునరుద్ధరణ పనులను అప్పగించినట్టు విచారణలో వెల్లడయింది. సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్లే వంతెన కూలిపోవడం జరిగింది. బిహార్‌లో వంతెనలు నిర్మాణంలో ఉన్నప్పుడో లేదా నిర్మాణమైన వెంటనే కూలిపోతేనో ఆశ్చర్యపోయేవాళ్లు ఎవరూ ఉండరు సుమా! ఒక వంతెన అయితే నిర్మాణంలో ఉండగానే మూడుసార్లు కూలిపోయింది! ఎంత సమయం, మరెంత ధనం వృథా! ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటి కారణం జవాబుదారీతనం పూర్తిగా లోపించడమే. ఒక వినాశనకర ప్రాజెక్టుకు పలువురు అధికారులు బాధ్యులయితే అంతిమంగా ఆ నష్టానికి ఏ ఒక్కరూ జవాబుదారీ కాదు అన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించడం సాధారణమైపోయింది. రాజకీయ అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అపరిమిత ఆర్థిక లబ్ధిని సమకూర్చే మంత్రిత్వశాఖల విషయమై మంత్రుల మధ్య తీవ్ర పోటీ ఉంటోంది. చాలా రాష్ట్రాలలో 'రేట్ కార్డ్' ఉన్నది. ప్రాజెక్టులను అధ్వానంగా అమలుపరచడంలో కొన్ని విభాగాలు/ఏజెన్సీలు అప్రతిష్ఠను మూటకట్టుకుంటున్నాయి. ఈ విషయంలో పీడబ్ల్యూడీలు అగ్రగామిగా ఉన్నాయి. తక్కువ వ్యయ గృహ నిర్మాణాలు చేసే (ఇవి నిజానికి కాంక్రీట్ మురికివాడలు) డీడీఏ మొదలైన వాటి తీరుతెన్నులు కూడా ప్రశస్తంగా ఉండడం లేదు. హైవేస్, రైల్వేస్ పని తీరుకూడా ఇదే రీతిలో అధ్వానంగా ఉంటోంది. ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలు సమర్థంగా, ప్రజోపయోగకరంగా లేకపోవడమనేది ఒక క్లిష్ట సమస్య. అపరిష్కృతంగా కొనసాగుతున్న ఒక చిక్కుముడి. సాహసోపేతంగా అసాధారణ చర్యలు చేపట్టినప్పుడే అది పరిష్కారమవుతుంది. ఇందుకు సామాజిక, సామూహిక సదుపాయల నిర్మాణంలో ప్రభుత్వ ఏజెన్సీల ప్రమేయాన్ని దశల వారీగా తొలగించాల్సి ఉన్నది. ఇటువంటి 'సంస్కరణల'కు గతంలో ప్రయత్నాలు జరిగాయి, విఫలమయ్యాయి. మరోసారి అటువంటి సంస్కరణలకు ప్రయత్నించినా మళ్లీ విఫలమవడం ఖాయం. మార్గాంతరమేమిటి? టెలీకమ్యూనికేషన్స్, విద్యుత్ పంపిణీ, రవాణారంగం, మైనింగ్, చమురు, సహజవాయువు అన్వేషణ తదితర రంగాలలో ప్రైవేటీకరణ పరిస్థితులను మెరుగుపరిచింది. నాణ్యమైన సేవలను అందించేందుకు దోహదం చేసింది. ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలలోనూ అదే బాటను అనుసరించడం ఉత్తమం. తొలుత వ్యయాలు పెరగవచ్చు, నిర్మాణ సంస్థలు ఒక కూటమిగా ఏర్పడడమూ జరగుతుంది, సందేహం లేదు. అయితే లొసుగులు, లోపాలు సరిదిద్దుతూ సామూహిక, సామాజిక సదుపాయాల నిర్మాణంలో ఆరోగ్యకరమైన పోటీతో ప్రైవేట్ సంస్థలకు మరింత పాత్ర కల్పించడమే అన్ని విధాల శ్రేయస్కరం.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం






- 15 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- చదువు చెప్పిన గురువులను సన్మానించిన విద్యార్థిని విద్యార్థులు
- ?సంతోషం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

**చేగుంట,జూలై13(సూర్యరేఖ):** చేగుంట మండల కేంద్రంలోని వడియారం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-2010 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, గంగుబాయి ప్రభాకర్ సంగీత పాండు పిటి నరేష్ లకు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించిన అనంతరం బహుమతులు అందజేశారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ. మాకు ఈ సబ్జెక్టు అర్థం కాలేదని టీచర్లను అడిగితే కనీసం విసుక్కోకుండా అర్థమయ్యేలా ఒకటికి పది సార్లు చెప్పడంతోనే మేము అత్యుత్తమ మార్కులు సాధించి పదవ తరగతిలో పాస్ అయ్యామన్నారు. మాకు విద్యను బోధించిన ఉపాధ్యాయుల సహకారంతోనే మేము ఉన్నత స్థాయిలో ఉన్నామన్నారు.

# భారత్ వికాస్ జనరిక్ మెడికల్ నూతన షాపు ప్రారంభం

**మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజహరినాథ్**

- **ప్రజలకు తక్కువ ఖర్చుతో ఔషధాలను అందించాలనే ప్రధాన లక్ష్యం**
- **జనరిక్ మందుల వల్ల ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి**
- **లాభాలను వికలాంగులకు, త్రాగునీటి సౌకర్యాల కల్పనకు, ఆడపిల్లల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యా సహాయానికి ఉపయోగిస్తాం**

ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు



**మేడ్చల్,జూలై13(సూర్యరేఖ):** మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని రాఘవేంద్రకాలనీలో నూతనంగా భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపును భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు ఆధ్వర్యంలో మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. జనరిక్ మందులు నాణ్యతలో బ్రాండెడ్ మందుల కంటే ఏ మాత్రం తీసిపోవని స్పష్టం చేశారు. ఈ మందుల ధరలు 30% నుండి 80% వరకు తక్కువగా ఉంటాయని, ఇది ప్రజలకు మందుల ఖర్చులను గణనీయంగా తగ్గించడంలో సహాయపడుతుందని ఆమె అన్నారు. జనరిక్ మందులు ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి. పేద,మధ్యతరగతి ప్రజలకు ఇవి ఒక వరం అని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు మాట్లాడుతూ.. ఈ భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపు కేవలం వాణిజ్యపరమైనది మాత్రమే కాదని,దీని వెనుక ఒక గొప్ప సామాజిక బాధ్యత సైతం ఉందని వెల్లడించారు. ఈ షాపు ద్వారా వచ్చే లాభాలను సంఘ సేవ కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వికలాంగులకు,త్రాగునీటి సౌకర్యాల కల్పనకు ఆడపిల్లల సంక్షేమానికి,పేద విద్యార్థుల విద్యా సహాయానికి ఈ నిధులను ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి షాపులు మరిన్ని ప్రజలకు అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బచ్చు సుబ్బారావు,ట్రస్ట్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఓం ప్రకాష్,ట్రస్ట్ సభ్యులు జలవేందర్,డాక్టర్ సుబ్బారావు,జనహిత ట్రస్ట్ మెంబర్ శ్రీదేవి వ్యాపారవేత్త జనార్ధన్ మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీధర్ గుప్త,ఎల్లంపేట్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి ప్రేమదాస్,మేడ్చల్ మున్సిపాలిటీ పురపాలక సంఘం బీజేపీ ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి లవంగ శ్రీకాంత్,జాకట బాబురాజు జాకట బాలకృష్ణ,బొజ్జ వంశీ రెడ్డి,కవిరాజు జె.నర్సింగ్,పుష్ప మల్లారెడ్డి,కానుకంటి భరత్ వంజరి,కేశవ రెడ్డి,మామిళ్ళ నర్సింగ్ రావు,చీర్ల సత్యనారాయణ,పతంజలి కిషోర్,ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

# మన వీధికి వచ్చిన నాటకం

సాంస్కృతిక దార్శనికుడు బాదల్ సర్కార్. నాటకం అంటే పుక్కిటి పురాణం కాదనీ, జనజీవన ప్రతిబింబమని నమ్మిన బాదల్ సర్కార్ భారతీయ రంగస్థలాన్ని విప్లవీకరించారు. అభివ్యక్తికి ఒక మౌలిక లక్ష్యం నిర్దేశించారు. అసమానతల గోడల్ని కూల్చడం కోసమే కళ అంటూ నినదించారు. ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితమైన రంగస్థలానికి స్వేచ్ఛను ప్రసాదించి, ప్రజా రంగస్థలంగా మలిచారు. కల్పిత కథలు, నిజ జీవితంతో సంబంధం లేని పాత్రలను కాలదన్ని పీడిత ప్రజలకు అండనిచ్చే హృద్యమైన మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు. నాటక ప్రయోక్తగా ఎన్నో భిన్నమైన ప్రయోగాలు చేశారు. సగటు మనిషి ప్రసక్తి లేని పౌరాణిక నాటకాన్ని, కులీన వర్గానికి మాత్రమే నవీన నాటకం రెంటినీ అధిగమించి మొట్టమొదటిసారిగా సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించారు. అందుకే ప్రపంచ రంగస్థలం ఆయన్ని 'ఫాదర్ ఆఫ్ థర్డ్ థియేటర్'గా గౌరవిస్తోంది. జూలై 15, 1925న కలకత్తాలో సుధీంద్ర సర్కార్‌గా పుట్టిన బాదల్ ఇంజనీరింగ్ చదివారు. ఇంగ్లాండ్, నైజీరియా మొదలైన దేశాలలో ఉద్యోగాలు చేశారు. యాభై వరకు నాటకాలు రచించిన బాదల్ సర్కార్ భారతదేశంలో పీడిత ప్రజల పక్షాన ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని లోతుగా అధ్యయనం చేసిన మొదటి వ్యక్తి. సంప్రదాయక నాటక రంగాన్ని కాదని సమిష్టి కృషితోనే కళ సంపూర్ణ వికాసం పొందుతుందని ఆయన నిరూపించారు. అందుకే, నాటక ప్రదర్శనకి ఆయన సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ప్రదర్శనశాలలకు పరిమితమైన నాటకాన్ని ఏకంగా నాలుగు వీధుల కూడలిలోకి తీసుకువచ్చి మొదటిసారిగా 'వీధి నాటకాన్ని' నిర్మించారు. భారతీయ రంగస్థల చరిత్రలో అదో అసాధారణ విప్లవం. నాటకం అంటే గంటలకొద్దీ సాగే కథనం కాదని, అది ఒక నిరంతర చైతన్య ప్రవాహమని బాదల్ చాటారు. వీధి నాటకాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు. ఆ ప్రక్రియలో నిత్య ప్రయోగశీలిగా నిలిచారు. ఈనాటికి కూడా స్ట్రీట్ ప్లే (వీధి నాటకం), అది ఏ ప్రాంతంలో, ఏ స్థాయిలో ప్రదర్శితమౌతున్నా దానికి ఆద్యుడు మాత్రం బాదల్ సర్కారే. బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే జీవితాన్ని వినూత్నంగా దర్శింపజేసే విశిష్టమైన కళాత్మక సాధనం. అదేదో అలౌకికమైనది కాదు. సమాజంలో భాగం. జీవితానికి ప్రతిబింబం. సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలి. అందుకే, అసలు వీధి నాటకం కళే కాదన్న వారికి దీటుగా జవాబిస్తూ, 'ప్రధాన స్రవంతి నాటకం ఆధిపత్య రూపమైతే, ప్రత్యామ్నాయ నాటకం మార్పుకు మాధ్యమం' అని బాదల్ నిరూపించారు. నక్సల్బరి ప్రభావితులయిన సగటు బెంగాల్ యువత సంక్లిష్ట మనస్తత్వాన్ని చిత్రించే అనేక విలువైన నాటక రచనలు బాదల్ చేశారు. 'అవర్ స్ట్రీట్ థియేటర్' (మన వీధి నాటకం) అన్న తన పుస్తకంలో పాలకుల నిర్బంధంలో వీధినాటకం, 'గెరిల్లా నాటకం'గా రూపాంతరం చెందుతుందని బాదల్ అన్నారు. ప్రశ్నను సహించలేని పాలక వర్గాలు, ధిక్కారాన్ని ఓర్చుకోలేని ప్రభుత్వాలు కళలను కట్టడి చేయడానికి, అణచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజా నాటకం మరింత బలోపేతం కావాలని బాదల్ అన్నారు. నాటక కళా తాత్వికతను పునర్ నిర్వచించిన బాదల్, నాటకం అంటే కేవలం కల్పిత వినోద 'ప్రదర్శన' కాదని, అది వ్యవస్థలోని నిజాలను 'నిదర్శనం'గా చూపే శక్తిమంతమైన వాహకమని అన్నారు.

అందుకు అనుగుణంగానే చివరి వరకు ఆయన జీవితం సాగింది. దశాబ్దాల పాటు ప్రత్యామ్నాయ నాటక కళా ఉద్యమానికి నేతృత్వం వహించిన బాదల్ సర్కార్ ఎన్నడూ పాలకుల మెప్పు కోసం పాకులాడలేదు. మొదట్లో పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారాల్ని అంగీకరించినా తర్వాత కాలంలో చైతన్యం పెంపొంది ప్రభుత్వం ఇస్తానన్న పద్మభూషణ్ అవార్డును రెండుసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 1967లో 'శతాబ్ది' అనే రంగస్థల సంస్థను స్థాపించిన బాదల్, ఈబాంగ్ ఇంద్రజిత్, బాసి ఖబర్, సారీ రాత్, పగల గోడా, స్పార్టకస్, బోమా వంటి అనేక వైవిధ్య నాటకాలు రచించారు. అతి తక్కువ ఖర్చుతో, తక్కువ మందితో ఎక్కడికక్కడ సొంతంగా ప్రదర్శించగలిగేది వీధి నాటకం. అందుకనే, పౌరసమాజంపై వెన్వెంటనే గాఢమైన ముద్రవేసే ఈ ప్రక్రియ త్వరలోనే ప్రజల్లోకి లోతుగా వెళ్ళిపోయింది. అనేక సాంస్కృతిక సంఘాలు వీధి నాటకాన్ని ఆయుధంగా ప్రయోగించడం పెరిగిపోయింది. 80వ దశకంలో కేరళలో ప్రారంభమై దేశ వ్యాప్తంగా కొనసాగిన వైజ్ఞానిక కళాజాతా మొదలుకుని జాతీయ స్థాయిలో జరిగిన మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం, తెలుగు రాష్ట్రాల్లో ఉవ్వెత్తున ఎగిసిన అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక ఉద్యమం తదితర ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తి నింపిన వివిధ కళా రూపాలు, వీధి నాటకాలకు మూలం నాడు బాదల్ సర్కార్ రూపొందించిన రంగస్థల కార్యాచరణ ప్రభావితాలే.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట రైతుల ధర్నా





**పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం, అడ్డుకున్న పోలీసులు..**

**రైతులకు న్యాయం చేస్తానని తెలిపిన ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి,జూలై13 (సూర్యరేఖ)** బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద సూసైడ్ అటెంప్ట్ బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట నెన్నెల మండలానికి చెందిన రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన పోలీస్ సిబ్బంది అతడిని అడ్డుకొని నచ్చజెప్పారు.తమ భూమి సమస్య చెప్పుకుంటే అధికారులు పరిష్కరించడం లేదని, ఎమ్మెల్యే కు విన్నవించుకుందామంటే ఆయన కలవడం లేదని బాధితుడు ఆరోపించాడు. అటవీశాఖ అధికారుల వేధింపులు తట్టుకోలేక, చనిపోదామని అనుకుంటున్నా అని చెప్పాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వస్తే ఎమ్మెల్యే కలవడం లేదని వాపోయాడు.వెంటనే ఎమ్మెల్యే వారిని పిలిచి మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం వల్ల వారు తిరిగి వెళ్ళిపోయారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జూలై13 (సూర్యరేఖ)** ఓల్డ్ రామంతాపూర్ జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.తన దృష్టికి వచ్చిన మాదిగ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.లైబ్రరీ ఏర్పాటు చేస్తా అని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు,బోసాని పవన్,సూరం శంకర్ ముత్యాల నరహింహా అధ్యక్షుడు ఆనంద్ నర్సింహా భరత్, అశోక్ అరుణ్,తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం





**కాంగ్రెస్ పార్టీ "బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ లోని భవానినగర్ కాలనీలో పర్యటన..**

**నెమలి అనిల్ కుమార్**

**ఉప్పల్,జులై13 (సూర్యరేఖ)** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ లోని భవానినగర్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆదివారం అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పర్యటించడం జరిగింది కాలనీలో ఉన్న ప్రధాన సమస్యల గురించి తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో భవాని నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నర్సింహా రావు,వర్కింగ్ ప్రెసిడెంట్ కటకం సురేష్ ఉపాధ్యక్షులు బాబా నిర్మల దేవి అడ్వైజర్ శ్రీమన్నారాయణ ఆర్గనైసింగ్ సెక్రటరీ సిద్దేశ్వర్ జాయింట్ సెక్రెటరీ రాజు,కివిరాజ్ పన్వార్ సతీష్,మల్లాపూర్ సీనియర్ నాయకులు సీతాల వీరాస్వామి మేడ్చల్ మల్కాజ్గిరి ఎస్సీ. సెల్ అడ్వైజర్ పీజీ. సుదర్శన్ మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శ్రీకాంత్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్,మల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్ కె.సురేష్ గౌడ్,పాషా,మల్లాపూర్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగవీటి ప్రిన్కు అశోక్ గౌడ్,జానీ హరి భాను,భరత్,రఘు,వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ లో రాగి జావా మిల్లెట్స్ పంపిణి...



**నిజాంపేట,జూలై13(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోసియేషన్ ఓపెన్ జిమ్ లో ఆదివారం యోగ వ్యాయామం అనంతరం సభ్యులందరికీ రాగిజావా మిల్లెట్స్ ను అందించారు.ఉరుపుల పరుగుల జీవితాల్లో యోగ వ్యాయామంతో పాటు మంచి పౌష్టికాహారం ఎంతో అవసరం అన్నారు.ప్రతి సండే దాతల సహకారంతోఆరోగ్యకరమైన ఫ్రూట్స్ పదార్థాలు అందిస్తామని ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపీ రఘునందన్ రావును కలిసిన బుడ్డ భాగ్యరాజ్



**కొల్చారం,జూలై13(సూర్యరేఖ)** మెదక్ పార్లమెంట్ సభ్యులు డేరింగ్ డ్యాషింగ్ డైనమిక్ లీడర్ మాధవనేని రఘునందన్ రావును ఆదివారం ఉదయం మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చందాయిపేట తాజా మాజీ సర్పంచ్ బుడ్డ భాగ్యరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. గత వారం రోజుల క్రితం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో శస్త్ర చికిత్స అనంతరం కోకాపేటలోని అతని స్వగృహంలో కలిసి ప్రజా క్షేత్రంలో సేవ చేయడానికి తొందరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూన్నట్లు బుడ్డ భాగ్యరాజ్ తెలిపారు.

## బంగారు మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య







**బెల్లంపల్లి,జులై 13 (సూర్యరేఖ)**బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు చెల్లించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,పాడిపంటలతో,అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం,ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సాయి నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి..

**నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్**




**ఉప్పల్,జూలై 13 (సూర్యరేఖ)** సాయినగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు.నాచారం సాయి నగర్ కాలనీలో చాలా కాలంగా ఉన్న మురుగునీటి సమస్య వల్ల ప్రతిరోజు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్లను సమస్య పరిష్కారానికి డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది.సమస్య పరిష్కరించడానికి సుమారు అయిదున్నర లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి డ్రైనేజీ పనులు ప్రారంభించడం జరిగింది.నాచారం ప్రధాన రహదారి పైనుండి చంద్రగ్రాండ్ హెూటల్ పక్కనున్న చిన్న వీధిలో పెద్ద ఎత్తున వర్షపు నీరు కాలనీలోకి వచ్చి చేరుతుంది.ఈ సమస్య పరిష్కారానికి ఇదివరకే సుమారు రూ.4 లక్షల వ్యయంతో చంద్ర గ్రాండ్ హెూటల్ పక్కన ఉన్న చిన్న వీధిలో డ్రైనేజీ నిర్మాణం చేయించడం జరిగింది.కొద్ది భాగం ఓపెన్ నాలా పైన ఆర్ సిసి స్లాబ్ ఉండటం వల్ల స్లాబ్ కింద ఉన్న కచ్చా నాలా పూర్తిగా మురుగునీరు వర్షపు నీరు రోడ్డుపైకి వస్తున్నాయి.ఐదున్నర లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులు ఆర్ సిసి స్లాబ్ ఉన్న ప్రాంతంలో చేయకుండా మిగతాది చేయడం జరిగింది.ఆర్సీసీ స్లాబ్ తొలగించి మిగిలిన కొంత ప్రాంతం కూడా భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని జలమండలి డీజీఎం సతీష్ ని కార్పొరేటర్ కోరడంతో ఆర్ సిసి స్లాబ్ మేం కట్ చేయలేము మీరు చేయించండి మేము అందులో డ్రైనేజ్ లైన్ వేస్తామని హామీ ఇవ్వడంతో కార్పొరేటర్ తమ స్వంత ఖర్చులతో సుమారు 20 మీటర్లు ఉన్న ఆర్సీసీ స్లాబ్ ను పూర్తిగా తొలగించడం జరిగింది.తొందర్లోనే పూర్తి డ్రైనేజీ నిర్మాణం చేపడతామని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్,కట్ట బుచ్చన్నగౌడ్,చంద్రశేఖర్,స్వామి కాలనీవాసులు రవుఫ్,రూప,తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నపై హత్యాయత్నాన్ని త్రివంగ ఖండిస్తున్నాం

**ఎమ్మెల్సీ కవిత కిరాయి రౌడీలను పంపి దాడి చేయించారు.గురుచరణ్**






**నాంపల్లి,హైద్రాబాద్,జూలై13(సూర్యరేఖ)** తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయం ద్వాంసం చేసి,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై హత్యాయత్నాన్ని తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే యువ మంచ్ రాష్ట్ర తరపున త్రివంగ ఖండిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు కేయం.గురు చరణ్ తెలిపారు.ఈ సందర్భంగా గురు చరణ్ మాట్లాడుతూ...ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి జాగృతి సంస్థ అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కవిత తన కిరాయి రౌడీలను పంపి క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చేయించడం అత్యంత దారుణమని త్రివంగ ఖండిస్తున్నామని అన్నారు. వ్యతిరేకంగా న్యూస్ ఉంటె ప్రజాస్వామ్యబద్ధంగా ఖండించాలని,న్యాయ పరంగా పోరాడాలని కవిత కొంతమంది జాగృతి గుండాలు పంపి తీన్మార్ మల్లన్న పై,తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి చేయడం ఆమె దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు.తీన్మార్ మల్లన్నపై దాడి చేసి నంతా మాత్రాన బీసీ ఉద్యమం ఆగిపోదని ఇంకా ఉవ్వెత్తున బీసీ,ఎంబీసీల ఉద్యమం ఎగిసిపడుతుందన్నారు.బిసి,ఎంబీసీలల్లో వస్తున్న చైతన్యాన్ని జీర్ణించుకోలేని కొంతమంది రాజకీయ పార్టీల నాయకులపై,దాడిలో పాల్గొన్న గుండాల పై అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# చల్మెడలో గ్రామదేవతలకు బోనాలు





**గ్రామ దేవతలను దర్శించుకున్న మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు..**

**నిజాంపేట,జూలై13(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఆదివారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామస్తులందరీ సహ కారంతో కులాలకు అతీతంగా గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ. గ్రామంలో గత 5 సంవత్సరాల నుండి అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ప్రతి సంవత్సరం లస్కర్ బోనాలను పురస్కరించుకొని గ్రామస్తులంద రము కలిసి ధూప దీప నైవేద్యాలతో గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు.అ గ్రామదేవతల అమ్మవారి కృపతో గ్రామ మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని,ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతలకు వేడుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సంగేపునారాయణ,అధ్యక్షులు బాజా నాగరాజు, మల్లేశం బిక్షపతి,మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,ముత్యం రెడ్డి,మండల అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి,బాజా రమేష్,మాజీ ఉప సర్పంచ్ తుమ్మల రమేష్,పంజామహేందర్ నసీరుద్దీన్ కొమ్మట సత్యనారాయణ మధు గరుగుల శ్రీనివాస్ దేమే యాదగిరి,సుప్రభాత రావు,అల్లాడి వెంకటేష్ తుమ్మల రమేష్ అబ్బారెడ్డి శ్రీధర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్ శ్రీనివాస్ తిరుపతి కరుణాకర్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహంకాళమ్మకు బోనాలు





**నిజాంపేట,జూలై13(సూర్యరేఖ)** మండల కేంద్రంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మహంకాళమ్మ తల్లి ఆలయంలో అభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి విశ్వేశ్వర శర్మ మాట్లాడుతూ...ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ ఉజ్జయిని మాత మహంకాళమ్మ బోనాల సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామం లో మున్నూరు సంఘ సభ్యులు అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పాటు మహంకాళమ్మకు బైండ్ల వారి నృత్య ప్రదర్శనల మధ్య డప్పు చప్పులతో ఊరేగింపుగా తరలి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పిస్తామన్నారు.ఆ మహంకాళి అమ్మ వారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పాడిపంటలు సుభిక్షంగా పండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

**ఉప్పల్ సెక్షన్ ఏ.ఈ.ఎన్.నిఖిల్**




**ఉప్పల్,జూలై 13 (సూర్యరేఖ)** శాఖపరమైన మరమ్మతులు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈనెల 14వ తేదీ సోమవారం 11 కె.వి శ్రీశ్రీ నగర్ పీడర్ పరిధిలో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఉప్పల్ సెక్షన్ ఏ.ఈ. ఎన్ నిఖిల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆ సమయం లో ఆదర్శనగర్,గాంధీనగర్ శ్రీశ్రీనగర్,స్వరూప్ నగర్, మల్లికార్జుననగర్ నాగదేవత టెంపుల్,భరత్ నగర్, సెవెన్ హిల్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.అలాగే స్ట్రీట్ నెంబర్ -8 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.ఆ సమయంలో సర్వేకాలనీ సర్వే ఆఫీస్,స్కైవాక్ ఆపోజిట్ జెన్ ప్యాక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమతో సవిసిబ్బందితో సహకరించాలని ఏఈ.ఎన్ నిఖిల్ విజ్ఞప్తి చేశారు.

## బంగారు మైసమ్మను దర్శించుకుని పూజలు చేసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్







**బెల్లంపల్లి,జులై13 (సూర్యరేఖ)** ఆషాఢమాసం బోనాల సందర్భంగా బెల్లంపల్లిలోని బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు,నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో,సుభిక్షంగా ఉండాలని ఆ బంగారు మైసమ్మ తల్లిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## గల్లా వినయ్ కిషోర్ పర్యవేక్షణలో ఘనంగా శ్రీకనకదుర్గ అమ్మవారి బోనాలు..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 13(సూర్యరేఖ)** ఆషాఢమాస బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన ఉస్మాన్ గంజ్ లో కొలువై ఉన్నా శ్రీకనకదుర్గ అమ్మవారి బోనాలు సమర్పించి,దర్శనం చేసుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు వస్తారని,వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా బోనాల నిర్వాహకులు ప్రముఖ సంఘ సేవకులు గల్లా వినయ్ కిషోర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు శాంతిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొంది యావత్ ప్రజానీకం సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు శాంతి దేవిని ఆలయ సేవకులు గల్లా వినయ్ కిషోర్ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# విస్టా బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్,జూలై 13 (సూర్యరేఖ)** చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఎం.ఎన్.ఆర్ బాడ్మింటన్ కోర్టులో జరిగిన విస్టా బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ లో ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు.క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని నిలుపుతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,కాలనీవాసులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి బంగారు మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి





**బెల్లంపల్లి,జులై13(సూర్యరేఖ)** బంగారు మైసమ్మ బోనాల జాతరలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి,టిపిసిసి ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్,లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది.అలాగే చిన్న బుగ్గ సమ్మక్క సారక్క గద్దల దగ్గర శివారపు ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులచే బోనాల జాతర కార్యక్రమానికి 13వ వార్డు మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్,12వ వార్డు కౌన్సిలర్ నెల్లి శ్రీలత హాజరై మొక్కులు తీర్చుకొని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాల సమర్పించి ముక్కు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గోల్కొండ జగదాంబ మహాంకాళీ ఎల్లమ్మ తల్లి6వ పూజ,.బోనం సమర్పణ





**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 13(సూర్యరేఖ)** ఆషాడమాసం బోనాలను పురష్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభూత్వ దేవాదాయ దర్మాదాయ శాఖ ఈవో వసంత,దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చంటిబాబు పాలకవర్గ సభ్యులతో గోల్కొండ శ్రీజగదాంబిక మహాకాళి అమ్మవారి 6వ పూజ పురస్కరించుకొని అమ్మవారికి అభిషేకం,ఆభరణా అలంకరణ,6వ బోనం నైవేద్యం సమర్పణ గావించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ చంటిబాబు మాట్లాడుతూ.. .పంటలు పుష్కలంగా పండి రైతులు సంతోషంగా ఉండాలని,రైతులు సంతోశంగా ఉంటే దేశ ప్రజలు సుఖ సంతోశాలతో ఉంటారన్నారు.నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గోల్కొండకు చేరుకొని అమ్మవారికి 2 లక్షలకుపైగా భక్తులు శాంతియుతంగా దర్శనం చేసుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారని అన్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ చైర్మన్ చంటిబాబు స్పష్టం చేశారు.

# అటవీశాఖ అధికారులపై ఫైర్ అయిన బెల్లంపల్లి ఎమ్మెల్యే




**బెల్లంపల్లి,జులై13(సూర్యరేఖ)** నియోజకవర్గంలో పోడు రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదని అటవీ శాఖ అధికారులపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఫైరయ్యారు.మండలంలో నిర్వహించిన వనమహొత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. చెన్నూరు నియోజకవర్గంలో ఫారెస్ట్ అధికారులు ఒక రూల్ పెట్టి,బెల్లంపల్లి నియోజకవర్గంలో మరొక రూల్ పెట్టడం ఏంటని అధికారులపై మండిపడ్డారు. దీనిపై సంబంధిత మంత్రి,సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా ఊరుకునే ప్రసక్తి లేదని,ఇంత దూరమైనా ఇక్కడ నివసిస్తున్న రైతుల కోసం నేను ముందుండి పోరాడుతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలు ఇంకెన్నడు..పెద్దోళ్ళు అయ్యేది..

"నేటి -మాట"

**కొల్చారం,జులై13(సూర్యరేఖ)**పేదలు ఇంకెన్నడు పెద్దోళ్ళు అయ్యేది. బీదరికపు చీకట్లు తొలిగిపోయి..పున్నమి వెన్నెల నిండే రోజులు ఇంకెప్పుడు దరిచేరుతాయి.ఇప్పటికి కూటి కోసం గూడు కోసం ఉపాధికోసం బతుకుపోరాటం చేస్తున్న మధ్యతరగతి జీవితాలు ఎన్నడు బాగుపడుతాయి.ఏ ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించేది.. రాజకీయాలు పుట్టినప్పటి నుండి అన్ని పార్టీలు పేదల తలరాతలు మారుస్తామని.. దేశంలో పేదరికమే లేకుండా చేస్తామని దొంగ వాగ్దానాలు చేసి గద్దెనెక్కుతున్నారు.పేదప్రజలకు మేలు చేయడం మర్చిపోయి అధికారాన్ని అడ్డం పెట్టుకోని విచ్చలవిడిగా అవినీతి చేసే నాయకులు కొద్దికాలంలోనే కోట్లకు పడిగేలేత్తుతున్నారు.చెమటచుక్కల్ని రాల్చకుండా ఒళ్ళంచి పనిచేయని లీడర్లు లగ్జరీలైఫ్ ను ఎంజాయ్ చేస్తు ప్రజలు కట్టిన పన్నులతో లక్షల్లో జీతం తీసుకుంటూ అన్ని అలావెన్స్ లు పొందుతూ రాచమర్యా దలు అనుభవిస్తున్నారు.మేమింకా ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామని పేదరికాన్ని నిర్మూలిస్తామని నీతులు చెప్పుతున్నారు.

## హబ్సిగూడ సెక్షన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

విద్యుత్ శాఖ ఏ.ఈ. వి.గణేష్




**ఉప్పల్,జూలై 13(సూర్యరేఖ)**శాఖపరమైన మరమ్మత్తుల కారణంగా ఈనెల 14వ తేదీ సోమవారం 11కె.వి సిసిఎంబి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హబ్సిగూడ సెక్షన్ విద్యుత్ శాఖ ఏఈ.వి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆ సమయంలో వీఎస్టీ కాలనీ భవానినగర్ రోడ్ నెంబర్ 1,2,3 రాజీవ్ నగర్,లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.అలాగే 11 కెవి స్నేహపురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు స్నేహపురి, శ్రీనగర్ కాలనీ,విఎస్ టి కాలనీ,భవానినగర్,టిఅండ్ టికాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.11 కెవి నాచారం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు కాకతీయనగర్ రోడ్ నెంబర్ 1,2, హబ్సిగూడ హరిజన బస్తీ, పిఅండ్ టి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని హబ్సిగూడ సెక్షన్ ఏ.ఈ.వి.గణేష్ విజ్ఞప్తి చేశారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డికి

ప్రత్యేక కృతజ్ఞతలు..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 13(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ముస్లిం దూదేకుల సంక్షేమ సంఘం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముస్లిం దూదేకుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రాజమ్మద్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో బలహీన,వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన సమాన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ప్రశంసనీయమని,ఇది నిజమైన సామాజిక న్యాయం వైపు ఒక గొప్ప ముందడుగని అభిప్రాయ పడ్డారు.బీసీలతో పాటు ముస్లిం దూదేకుల వర్గాన్ని కూడా బీసీ (ఈ) వర్గంగా గుర్తించి పత్రికా స్థాయిలో అంగీకారం కల్పించాలని అన్నారు.విద్య,ఉద్యోగం,రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో ఆచరణతో అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని అయన కోరారు.

# మందమర్రి ఫోటో భవన్ వార్షికోత్సవ వేడుకలు








**మందమర్రి,జులై13(సూర్యరేఖ)** మందమర్రి పట్టణంలో ఫోటో భవన్ నిర్మాణం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.రెండోవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఇండియన్ గ్యాస్ గోదాం సమీపంలో గల ఫోటో భవన్ లో గల జెండాను అసోసియేషన్ అధ్యక్షులు పసుల వెంకటస్వామి ఆవిష్కరించారు.అనంతరం ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలవేసి,జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పసుల వెంకటస్వామి మాట్లాడుతూ... తమ నైపుణ్యాలతో శాశ్వత జ్ఞాపకాలను ఛాయాచిత్ర రూపంలో అందించే ఫోటో,వీడియో గ్రాఫర్ ల భవిష్యత్తు ముమ్ముందు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండి అసోసియేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వడ్లకొండ కనుకయ్యగౌడ్ పట్టణ కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్ ఉపాధ్యక్షులు లక్కిరెడ్డి అనిదర్ రెడ్డి, ఆర్.సుజిత్ నక్క పవన్ తాళ్లపల్లి రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మణిరాజ్ ప్రచార కార్యదర్శులు పసుల రవి రామసాని సురేందర్,కేశవేణి హరికృష్ణ, జూపాక సది,సర్వ సలహాదారులు నక్క తిరుపతి, ఎంవి సత్యనారాయణ జాడి ముకుందం, మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్వాస తిరుపతి,కుటుంబ భరోసా ఇన్చార్జి నూనె సురేష్, జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు,మండల నాయకులు,మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

## కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతరకు హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి







**కొల్చారం,జులై 13(సూర్యరేఖ)** కొల్చారం మండలం పైతర గ్రామంలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిట సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని కులవృత్తులకు పెద్ద ఎత్తున అన్ని విధాల ఆదుకోవడం జరిగిందని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు.బీఆర్ఎస్ యువ నేత రవితేజ రెడ్డి ఇంటి నుండి డప్పు చప్పులతో,బ్యాండ్ మేళాలతో పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. కుమ్మరి సంఘం వారు బోనాలు తీసే స్థలానికి భవనం నిర్మాణానికి తమ వంతు సాయం చేయాలని కుమ్మరి సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు కుమ్మరి సంఘ సభ్యులు విన్నవించారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే సాను కూలంగా స్పందించా రు.ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షు డు గౌరీ శంకర్ గుప్తా, కొల్చారం మండలం యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు,బీఆర్ఎస్ పార్టీ యువత ఐకాన్ అధ్యక్షుడు రవితేజరెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్ ఇంద్రసేనారెడ్డి, రామన్న ముదిరాజ్,దొడ్ల ఆంజనేయులు,మాజీ సర్పంచులు సంతోష ఎల్లేశం మురళిగౌడ్ మాజీ ఎంపిటిసి ఆరుట్ల ఎల్లయ్య,గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగంపల్లి మల్లేశం ఆంజనేయులు శంకరయ్య, సత్తయ్య గ్రామస్తులు,కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## మార్కండేయనగర్ పోచమ్మ దేవాలయం నూతన కమిటీ ఎన్నిక.



**రాజేంద్రనగర్,జూలై13(సూర్యరేఖ)** మార్కండేయనగర్ పోచమ్మ దేవాలయం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరాంజనేయ స్వామి దేవాలయం అధ్యక్షుడు గద్దె కృష్ణ,కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. దేవాలయం అధ్యక్షుడిగా శిరందాస్ నరేందర్, ఉపాధ్యక్షులుగా యాదగిరి భాస్కర్,మామిడి శెట్టి శ్రీనివాస్ భానుచందర్ ప్రధాన కార్యదర్శిగా కోట పవన్,సహాయ కార్యదర్శులుగా ఉడుత సురేష్, గుత్తి మల్లేష్,కోశాధికారిగా కోటా శ్యామ్,కార్యవర్గ సభ్యులుగా క్రైరం కొండ శంకర్,ఎస్. ప్రభాకర్,రావుల నవీన్,మూసం నరేష్,విజయ్ యాదవ్ శశిరాజ్ యాదవ్,ఎర్వ మహేష్,కాల రాజు,బి.రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ముఖ్య సలహాదారులుగా గద్దె కృష్ణ,పగిడిమర్రి సూర్యనారాయణ వాసు,విడెం రమేష్,వర్కాల చందు,మునగపాటి విష్ణు,గద్దె యాదగిరి,లు నియామకమయ్యారు.నూతన కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని గద్దె కృష్ణ తెలిపారు.రాబోయే బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకునేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు.

## ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమమే నా ఆకాంక్ష..

**శ్రీరేణుక ఎల్లమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్మోహన్**



**కామారెడ్డి,జులై13(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లాఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పట్టణ కేంద్రం,6వ వార్డు,ఇందిరానగర్ కాలనీలో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ 18వ వార్షికోత్సవ బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బోనాల వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు భక్తులు,భజన బృందాలు,డీజే బృందాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భక్తులతో కలిసి బోనం ఎత్తి,అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్మోహన్ మాట్లాడుతూ...శ్రీరేణుక ఎల్లమ్మ తల్లిదేవి కృప ఎల్లారెడ్డి ప్రజలందరిపైనా ఉండాలి.. ప్రతి ఇంట్లో ఆరోగ్యం,ఆనందం,ఐశ్వర్యంతో ప్రజలు నిలకడగా జీవించాలని ఆయన కోరుకోవడం జరిగింది.రైతులకు మంచి పంటలు పండాలి, మార్కెట్లో సరైన ధరలు లభించాలి,ఇదే నా ఆకాంక్షఅని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వందలాది మంది కాలనీ వాసులు, మహిళలు,యువత పాల్గొన్నారు. శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జాతర ముగిసింది.

## వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన షబ్బీర్ ఆలీ



**కామారెడ్డి,జూలై(సూర్య రేఖ)** కామారెడ్డి నియోజకవర్గం బిక్నూర్ మండలం భగీరథ పల్లి గ్రామంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమంలో షబ్బీర్ అలీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చదనంతో ముస్తాబుచేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభమైందన్నారు.ప్రకృతి పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం,ఈ సారి మరింత విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యత సాధించాలనే సంకల్పంతో ముందడుగు వేసిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బింరెడ్డి,టిపీసిసి ప్రధాన కార్యదర్శితో పాటు కాంగ్రెస్ పార్టీ. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు గొప్ప వరం సిఎంఆర్ఎఫ్ పథకం...

**- ఏ ఆపద వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటా ఆవుల రాజిరెడ్డి...**



**కొల్చారం,జూలై13(సూర్యరేఖ):**కొల్చారం మండలంలోని రంగంపేట సంగాయిపేట,ఏటిగడ్డ మాందాపూర్,గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రంగంపేట గ్రామంలో ప్రియతమ నాయకులు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా ఆరు చెక్కులను అందించారు.ఆరుగురు లబ్ధిదారులకు 2,07,500 విలువగల చెక్కులను లబ్ధిదారులకు రంగంపేట గ్రామపంచాయతీ ఆవరణలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ. ఓడిన గెలిచిన ప్రజల మధ్యలో ఉంటూ ప్రజాసేవకే నా జీవితం అంకితం చేస్తున్నారని మండలంలో ఎప్పుడు ఏ ఆపతి ఎవరికి వచ్చినా నేనున్నానని ఎవరు ఆధర్యపడవద్దని రాజిరెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి,కొల్చారం మండలం మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి,రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గొండ కృష్ణ,జిల్లా నాయకులు మరెల్లి అనిల్,మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి,అంజా గౌడ్,వెంకట్ గౌడ్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లి చందు,అప్పాజీపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఫాహాజ్ పాష,సంగాయిపేట్ అధ్యక్షులు అగంగౌడ్,నర్సాపూర్ మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా,నర్సాపూర్ మాజీ ఎంపీపీ సురేష్ నాయక్,శివ్వంపేట మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా,చిలుక ప్రభాకర్,నాయకులు గాండ్ల కృష్ణ,నాగభూషణం గౌడ్,మరెల్లి ప్రభాకర్, మహేష్,పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# చల్లంగా చూడు అమ్మోరు తల్లీ





**ఘనంగా గగన్ పహాడ్ బస్తీలో బోనాల ఉత్సవాలు..**
**గగన్ పహాడ్ బస్తీలో పండుగ వాతావరణం..**
**దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు..**
**బోనాలు సమర్పించిన మహిళలు**

**రాజేంద్రనగర్,జూలై 13(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహాడ్, తదితర బస్తీలల్లో ఆదివారం గ్రామ దేవతల బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహిళలు బోనాలను అందంగా ముస్తాబు చేసి తలలపై పెట్టుకొని ఒకేసారితరలి వెళ్లారు. డప్పుచప్పుళ్లు,పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు,శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి పోచమ్మ,మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అందరిని చలంగా చూడాలని మొక్కుకున్నారు. ఉత్సవాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.బోనాల ఉత్సవాలలో వివిధ పార్టీల నాయకులు శీలం తిరుపతిరెడ్డి, సరికొండ వెంకటేష్,సూరెడ్డి సాయి రెడ్డి,న్యాయ వాది శీలం వెంకట్ రెడ్డి,మైలార్ దేవులపల్లి డివిజన్-2 బిజెపి అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి,స్టార్ వెంకటరెడ్డి సూరెడ్డి సాయి కృష్ణారెడ్డి (సాయి),సూరెడ్డి సంతోష్ కుమార్ రెడ్డి,సిద్దేశ్వర గౌడ్,తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

# ఉప్పల్ మినీ శిల్పారామం లో అలరిస్తున్న హస్తకళ ప్రదర్శన






**అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన..**

**ఉప్పల్,జూలై 13 (సూర్యరేఖ)** ఉప్పల్ మినీ శిల్పారామంలో ఏర్పాటు చేసిన "థీమాటిక్ ఎక్సహిబిషన్" రెండవరోజు హస్తకళా ఉత్పత్తులు ఎంతగానో ఆకట్టుకున్నాయి.హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ డ్రెస్సెస్,కొండపల్లి బొమ్మలు,చెరియల్ మాస్కలు పెయింటింగ్స్,సవర పెయింటింగ్స్ క్రాస్ స్టిచ్,బొబ్బిన్ లేస్, అగర్బతిలు,బుట్టలు,మరి ఎన్నో హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఆదివారం చంద్ర శేఖర్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఝుమ్ ఝుమ్ తనన, పుష్పాంజలి జయము జయము నారాయణతేయ్, తక్కువేమి మనకు కొలువైతివారంగా సాయి,చంద్ర శేఖరం జతిస్వరం,పలుకే బంగారమాయెనా,ప్రహ్లాద శబ్దం,ధనశ్రీ తిల్లాన బృందావన నిలయే మొదలైన అంశాలను సురభి శ్రీ అన్ను,వాసుకి, రిషిక,యోగదా, శాన్వి రిత్విక్ అనేక,అనికా వల్లభి,మేధ,అక్షర, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# సమాజ సేవకు క్రమశిక్షణను పెంపొందించుకోవాలి



**ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకం ఆవిష్కరణలో**
**హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ**



**రాజేంద్రనగర్,జులై13(సూర్యరేఖ) :** సమాజ సేవకు క్రమశిక్షణను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు.ప్రతి ఒక్కరూ ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకం చదవాలని వ్యాఖ్యానించారు.ఆదివారం చేతుల మీదుగా ఆయన జీవిత చరిత్ర పుస్తకం తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాజసేవతో క్రమశిక్షణ అలవాడడమే కాకుండా సమాజంలో గుర్తింపు లభిస్తుందని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ అన్నారు.శంషాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ పూర్వ అధ్యక్షులు,ప్రస్తుత జిల్లా కౌన్సిల్ సభ్యులు సాబాద విజయ్ కుమార్ లు గవర్నర్ ను కలిశారు.ఈ సందర్బంగా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయనకు తన జీవిత చరిత్రపై రాసిన ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని బహూకరించారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరి జీవితంలో ఒడిదుడుకులు సహజమేనని,వాటిని అధిగమించిన వారే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలు గుతారని వివరించారు. సాబాధ విజయ్ కుమార్ మాట్లాడుతూ...హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఆయన జీవిత చరిత్ర పుస్తకం తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.ఈ పుస్తకంలో వారి జీవిత సందేశంతో పాటు దేశాసేవ పట్ల నిబద్ధత,ప్రజల పట్ల ప్రేమ,ఆత్మీయత సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కనిపిస్తాయని వివరించారు. ఎంతో మందికి ఈ పుస్తకం ఆదర్శంగా నిలుస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్,భూపాల్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి రాంచంద్రా రెడ్డి,డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్,రాష్ట్ర యువమోర్చ అధ్యక్షులు సేవెళ్ళ మహేందర్,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూ డెం మల్లారెడ్డి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్,కొత్త సోల్కర్ రెడ్డి సాగర్ రాజు బాత్కు శ్రీనివాస్ యాదవ్ ఎన్. జగన్ భవానీదాస్,గొరిగే రాజు విజయ్‌రౌత్ పి.సాయికిరణ్ నర్సింహారాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబుల్ రెడ్డినగర్ లో వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు..



**రాజేంద్రనగర్,జూలై13** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డినగర్ అమ్మవారి ఘటాల ఊరేగింపు ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని తలపై పెట్టుకుని కాలనీ పురవీధుల్లో మేళా తాళాలు,పోతరాజుల విన్యాసాలతో అమ్మవారిని ఊరేగించారు. ఈనెల 20 వ తేదీన అమ్మవారి బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల గుండా సాగింది.భక్తులు అడుగడుగునా అమ్మవారికి నీరజనాలు పలికారు.ఘటాల ఊరేగింపుకు స్వాగతం పలుకుతూ మహిళలు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. దారిపొడవునా మహిళలు బిందెలతో నీళ్లు పోస్తూ అమ్మవారికి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్,సోమ శ్రీనివాస్ గుప్తా,మల్లేష్ పోతురాజ్,కిష్టప్ప పోతురాజు, రమేష్ రెడ్డి, పోతురాజు బీరప్ప,శంకర్,జగదీష్, అగర్వాల్ సందీప్,అశోక్ కుమార్ సునీల్ సన్నీ, రమేష్,గోపాల్ నాయక్,సురేష్,శేఖర్,చెన్నయ్య, కిరణ్,బాలు ఆనంద్ సాగర్,అంగత్,తదితరులు పాల్గొన్నారు.

## 6 మంది పేకాటరాయుళ్ల అరెస్టు..

**రూ.3,210 నగదు,సెల్‌ఫోన్లు సీజ్**



**శంషాబాద్,జూలై13(సూర్యరేఖ)** పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శంషాబాద్ పోలీసులు ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండుపల్లిలో 5స్టార్‌గ్రాండ్ హొటల్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆరుగురు వ్యక్తులు బెట్టింగ్‌లు పెట్టుకొని మూడు ముక్కలాట ఆడుతున్నారు.వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.3,210 నగదుతో పాటు ఆన్‌లైన్ లావాదేవిలు,ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తొండుపల్లికి చెందిన అంజయ్య,ఊటుపల్లికి చెందిన ప్రదీప్,జైపాల్,ఎం.రాజు,కిషన్‌గూడకు చెందిన కొండరాజు బాలపూర్‌కు చెందిన నిఖిల్‌కుమార్, హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌కు చెందిన తిరుపతిరావు,లను ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో కారులో మంటలు..



**శంషాబాద్,జూలై 13(సూర్యరేఖ)** శంషాబాద్ అంతర్జాతీయ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఓ బెంజ్ కారులో మంటలు చెలరేగాయి.ఎయిర్‌పోర్టు అవుట్ పోస్టు సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 11 గంటల సమీపంలో శ్రీకాంత్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళున్న క్రమంలో వోల్వో కారు సిఐఎస్‌ఎఫ్ చెకపోస్టు సమీపానికి రాగానే కారులో నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ కారులో నుంచి కిందకు దిగిపోయాడు.విషయం తెలుసుకున్న పోలీసులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు పూర్తిగా ఆర్పివేశారు.అప్పటికే కారు ముందుభాగం దెబ్బతిన్నట్లు చెప్పారు.కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు.అతడికి ఎలాంటి గాయాలు కాలేదు.దీంతో ఆటు పోలీసులు,ఇటు ప్రజలు ఎయిర్‌పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బత్తుల సరితకు గౌరవ డాక్టరేట్ అవార్డు







**మందమర్రి,జూలై13(సూర్యరేఖ)**తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సామాజిక సేవలు అందించినందుకు గాను మందమర్రి వాస్తవ్యులు బత్తుల సరితకు “హానర్ ఇన్ సిఏయుఎస్ఏ” గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు.రాష్ట్రంలో వివిధ రంగాలలో ప్రావీణ్యం కలిగిన కళాకారులకు తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అవార్డులు అందించారు.ఈ సందర్భంగా బత్తుల సరిత మాట్లాడుతూ...నేను చేసినటువంటి సామాజిక సేవలను గుర్తించి తెలుగు సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ సంస్థ అధినేత డాక్టర్ మాచారం గౌరీ శంకర్,బట్టు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకోవడం నాకు చాలా సంతోషక రంగా ఉందని,సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డును అందుకోవడం తన అదృష్టంగా భావిస్తూ ఈ సత్కారం గౌరవం, అభిమానం,ఎన్నటికీ మరువలేనని ఇంకా మరింత బాధ్యతతో సామాజిక సేవ రంగంలో తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా అవార్డు అందుకున్న బత్తుల సరిత ను పలువురు అభినందించారు.

# వైభవంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి..**
**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి**



**రాజేంద్రనగర్,జూలై13(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ లక్ష్మీగూ డ బస్తీలో పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు.ఉదయం నుం చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీగూడ బస్తీ మహిళలు బోనాలను అందంగా ముస్తాబు చేసి తలలపై పెట్టుకొని ఒకేసారి తరలి వెళ్లారు. డప్పుచప్పుళ్లు,పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి పోచమ్మ,మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలుతో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కోనసాగించారు. అనంతరం కొలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ. పట్టణాల్లో,పల్లె గ్రామాలలో సనాతనంగా గ్రామ దేవతలు కొలువు ఉన్నచోటే పండగ వాతావరణం కొలువై ఉంటుందన్నారు.ఊరంతా ఒకేసారి జరుపుకునే పండగల్లో పోచమ్మ మైసమ్మ పండగ లు ఎంత ప్రాతినిధ్యం ఇస్తాయని ఆయన ఆనం దం వ్యక్తం చేశారు.గ్రామాలలో అంటువ్యాధులు దూరం చేయడంలో గ్రామ దేవతలు కొలువై ఉండడం ద్వారా అవి దరిచేరవని వస్తున్న ఆచా రం అని పేర్కొన్నారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కొలన్ సుభాష్ రెడ్డి కోరుతున్నారు.ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి పాల్గొ న్నారు.శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమా నికి హాజరైన సుభాష్ రెడ్డికి దేవాలయ పెద్దలు సాదరంగా స్వాగతం పలికి శాలువతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.వేద పం డితులు ఆశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందజే శారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డి.రమేష్ ముదిరాజ్,జే.చిత్తారి,శివ ముదిరాజ్,మహేందర్ ముదిరాజ్,వాసు బాబు,నా యకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాశకు పోయి కష్టార్జితాన్ని సమర్పించకండి

**ఎస్సై ఎస్.రాజశేఖర్**



**మందమర్రి,జులై13(సూర్యరేఖ)** పెరుగుతున్న సాంకేతికతో పాటు సైబర్ నేరాలు పెచ్చు మీరుతున్నాయని తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశలు పుట్టించి,ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకొని మాధ్యమాల ద్వారా సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ..మధ్య తరగతి ప్రజల ఆర్థిక అవసరాలను లక్ష్యంగా చేసుకొని,తక్కువ వడ్డీకీ లోన్ ఇప్పిస్తామంటూ మోసాలు చేస్తున్న ఉదంతాలు కూడా లేకపోలేదని,ప్రజల్లో అత్యాశ అవగాహన లేకపోవడం వలనే సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు ‘డిజిటల్ అరెస్ట్’ అనగానే భయపడవద్దని,అలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్ళవద్దని సూచించారు.సోషల్ మీడియా ద్వారా వచ్చే అనధికారిక లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని కోరారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు నకిలీ పిఎం కిసాన్,ఎస్బిఐ రివార్డ్ వంటి పేర్లతో ఏపీకే ఫైల్స్ ను వాట్సాప్ టెలిగ్రామ్ ఇతర సోషల్ మీడియా ద్వారా పంపిస్తున్నారని,పొరపాటున ఇలాంటి లింక్స్ క్లిక్ చేసి అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.దీని ద్వారా ఫోన్‌లోని ఓటిపిలు,బ్యాంక్ వివరాలు వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళతాయనీ,అనంతరం నేరగాళ్లు బాధితుడి వాట్సాప్ ఖాతాను హైజాక్ చేసి,అదే నకిలీ లింక్‌ను అతని కాంటాక్ట్స్‌లో ఉన్న వారందరికీ ఆటోమేటిక్‌గా పంపిస్తారని వివరించారు.తద్వారా బాధితులు ఆర్థిక నష్టాలకు,వ్యక్తిగత డేటా చోరీకి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇలాంటి నకిలీ ఏపీకే ఫైల్స్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు వాట్సాప్‌లో వచ్చే అనుమా నాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థి తుల్లోనూ క్లిక్ చేయరాదన్నా రు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం,బ్యాంక్ వివరాలు లేదా ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేయవద్దని సూచించారు.ప్రభుత్వ సంస్థలు,బ్యాంకులు సున్నితమైన సమాచారాన్ని ఫోన్ల ద్వారా ఎన్నడూ అడగవని ఆయన స్పష్టం చేశారు.బూటకపు యాప్ లను డౌన్ లోడ్ చేసుకుని మోసపోవద్దని ఎస్సై సూచించారు.

## ప్రవేట్ పాఠశాలల ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావడానికి జాప్యందేనికి..?

**నాంపల్లి,జూలై13(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని,విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనీ తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు పాఠశాల విద్యార్థి సంగం కార్యదర్శి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ..ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకు వస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని,విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు.విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకుండా కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల నియంత్రణ కోసం చట్టం త్వరితగతిన తీసుకురావాలని డిమాండ్ చేసారు.

## కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా:

**కావలి భాస్కర్**



**మేడ్చల్,జూలై13(సూర్యరేఖ) :** కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్మిక విభాగం అధ్యక్షుడు కావలి భాస్కర్ అన్నారు.ఆదివారం జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా కావలి భాస్కర్ ముదిరాజ్ ను గుండ్లపోచం పల్లి పురపాలక సంఘం కార్మిక విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసుశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ భాధ్యతను అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ గౌడ్, మేడ్చల్ అసెంబ్లీ లేబర్ సెల్ ఇంచార్జి సాయిపేట మల్లేష్,వినోద్ ఉదయ్ గౌడ్,మలిగే కిషన్,బండారి వెంకట్,శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ మండల అధ్యక్షునిగా పిట్ల విఠల్



**ముస్తాబాద్,జూలై14(సూర్య రేఖ):** ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ఎంపికకు ఆదివారం ఎన్నికలు నిర్వహించగా మిగతా పదవులు ఏకగ్రీవం అయ్యాయి.ఈ ఎన్నికలో 24 సంఘాల అధ్యక్షలు పాల్గొన్నారు.పిట్ల విఠల్ షాడ శ్రీనివాస్ పై 2 ఓట్ల మెజారిటీతో గెలుపొంది నూతన అధ్యక్షుడిగా నియామకం అయ్యాడు.ప్రధాన కార్యదర్శులుగా జింక పవన్,జెల్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా జింక మల్లేశం,గాడిచర్ల రామచంద్రం,ఈర్ల విద్యాధర్, కంచం నర్సింహులు,కోశాధికారిగా బోయిని గంగాధర్,సహాయ కార్యదర్శు లుగా జాల భిక్షపతి,గీస భిక్షపతి,నిమ్మల రాములు,సోమరిపేట నర్సింహు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికైన నూతన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని వారు తెలిపారు.

## అక్రమ రిజిస్ట్రేషన్లు ఒప్పుకున్న శీలం సుభాష్ రెడ్డి

**తాహసిల్దార్ విచారణలో బయట పెట్టిన వైనం..**



**రామాయంపేట, జూలై 13(సూర్య రేఖ)** గతంలో ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన పట్టాలను ప్రైవేటుగా రిజిస్ట్రేషన్లు రామయంపేట పట్టణానికి చెందిన శీలం సుభాష్ రెడ్డి పైన ఇటీవల వార్తాపత్రికల్లో కథనాలు రావడం జరిగింది. రామాయంపేట తాహసిల్దార్ రజిని కుమారి విచారణ చేపట్టారు.మండల సర్వేయర్ తో స్థలానికి వెళ్లి సర్వే చేయడం జరిగింది.ఈ సర్వేలో అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారణ కావడంతో తాహసిల్దార్ సుభాష్ రెడ్డిని ప్రశ్నించగా బీడీ కార్మికుల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసింది వాస్తవమేననీ ఒప్పుకోవడం జరిగింది.దీంతో తాహసిల్దార్ సుభాష్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇస్తాను సారంగా భూముల అమ్మడంతో పాటు అమ్మినవాటిని తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంలో సుభాష్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్, యాదవ సంఘం సభ్యులు,బీడీ కార్మికులు తాహసిల్దారును కోరారు.గ్రామస్తులు బీడీ కార్మికుల సమక్షంలో జరిగిన సర్వేలో సుభాష్ రెడ్డి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఒప్పుకున్నప్పటికీ పూర్తిస్థాయి నివేదిక వచ్చాక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పోచమ్మ,మైసమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి





**బోనాలు సమర్పించిన భక్తులు..**
**కిటకిటలాడిన ఆలయాలు..**
**బోనాల ఉత్సవాల్లో**
**రాజేంద్రనగర్ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై13(సూర్యరేఖ)** అమ్మవారి కరుణకటాక్షాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని నల్ల పోచమ్మ ఊరు పోచమ్మ బాబుల్ రెడ్డినగర్ ఘట్టాలు లక్ష్మీ గూడలో ఆషాడ మాసం బోనాల ఉత్సవాలలో భాగంగా అమ్మ వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఘటాల ఊరేగింపులో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్, మైలార్ దేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో పాడిపంటలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు,ముఖ్య నాయకులు,స్థానిక యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

**ఎమ్మెల్యే మదన్ మోహన్**

**కామారెడ్డి,జూలై13(సూర్యరేఖ)** ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని విద్యలో అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు.విద్యను సమాజ అభివృద్ధికి మూలస్తంభంగా భావిస్తూ,నియోజకవర్గవ్యాప్తంగా పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.తాజాగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో రూ.3.5 కోట్ల నిధులతో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్వయంగా సందర్శించారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు అధికారులతో సమావేశమై నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.నిర్మాణ నాణ్యతపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా,రూ.70 కోట్ల నిధులతో నిర్మిస్తున్న అడ్వాన్స్డ్ ఇన్ఫర్మేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ పనులు తుది దశకు చేరుకున్నాయని,త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు.ఇది విద్యార్థులు యువతకు నూతన అవకాశాల ద్వారాన్ని తెరచుతుందన్నారు.రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.ఇది విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి,సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతులు,వసతుల కల్పన కోసం నిధులు విడుదల చేసినట్లు వివరించారు.



ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నదని చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తున్నారని పేర్కొన్నారు.విద్యలో సమానత్వాన్ని సాధించేందుకు,ఆధునిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడం మా ప్రధాన లక్ష్యం.ప్రతి విద్యార్థి,ప్రతి కుటుంబం నాణ్యమైన విద్య పొందాలి అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ టీచర్లు,కాంట్రాక్టర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,తాజా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మార్కెట్ కమిటీ చైర్మన్,టౌన్ కాంగ్రెస్ నాయకులు మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమాత నల్ల పోచమ్మ అమ్మవారికి బోనాలు..

**బోనమెత్తినమ పద్మక్క**

**రామయంపేట,జులై13 (సూర్యరేఖ)** ఆషాడ మాసం పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం పట్టణ ముదిరాజ్ సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండుగ జాతర వైభవంగా నిర్వహించారు.ఈ బోనాల పండుగ ఉత్సవాలలో మెదక్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం.పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకొని నల్ల పోచమ్మ తల్లికి సమర్పించారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని తెలంగాణ రాష్ట్రంలో వర్షాల సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని నల్ల పోచమ్మ తల్లిని కురుకున్నారు. అనంతరం ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు సున్నం నరేష్,సభ్యులు మాజీ ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సన్మానించారుఈ మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మాజీ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,కో కన్వీనర్ గడ్డమీద కృష్ణగౌడ్, లింగారెడ్డి,మాజీ కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్, న్యాయవాది జీవన్ రావు నాయకులు గౌస్,సంతోష్, ముదిరాజ్ సంఘం నాయకులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నాకు న్యాయం చేయండి సార్ కొరంపల్లి గోపి..

- భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి...
- మండల తహసిల్దార్ కు విజ్ఞప్తి చేస్తున్న కొరంపల్లి గోపి...



**కౌల్చారం,జూలై13(సూర్య రేఖ):** కౌల్చారం గ్రామంలో కుంటలను చెరిపివేసి భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరంపల్లి గోపి మండల తహసిల్దార్ కు విజ్ఞప్తి చేయుచున్నాడు. కౌల్చారం గ్రామానికి చెందిన కొరంపల్లి గోపి మాట్లాడుతూ..నా తండ్రి కోరంపల్లి వీరయ్య పేరున 2005 సంవత్సరంలో 20 గుంటల భూమికి ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్ ఇచ్చారన్నారు.20 సంవత్సరాల క్రితం భూగర్భ జలాల పెంపుదల కోసం స్వయంసహాయక సంఘం సభ్యులు కమిటీగా ఏర్పడి అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో కొత్త కుంటలు నిర్మించారన్నారు. గుడ్డేనుగుల బొమ్మ వద్ద దొంకెన సత్తయ్య గుడ్డం నుంచి ఎందుగుల వాళ్ళ చేనుల వరకు మరో కుంటను నిర్మించారని,ఇటీవల కొంతమంది రైతులు దొంకెన సత్తయ్య గుడ్డం నుంచి ఎందుగుల వాళ్ళ చేనుల వరకు నిర్మించిన కుంటకట్టపై పెరిగిన పెద్ద పెద్ద వృక్షాలను జెసిబిల సహాయంతో తొలగించి కుంటకట్టను తవ్వేసి కొంతమంది రైతులు చదును చేస్తున్నారు.అదే భూమిలో నా తండ్రి కొరంపల్లి వీరయ్య పేరున 20 గుంటల భూమి పట్టా ఉందని కొరంపల్లి గోపి తెలుపుతున్నాడన్నారు. నా భూమిని నేను చదును చేసుకోవడానికి వెళ్లగా ఇతర రైతులు తనను దూషిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు.కుంటకట్టపై వృక్షాలను తొలగించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను వేడుకొనుచున్నాడు.

## ఆస్ట్రేలియాలో ఉన్నత చదువు కోసం వెళ్తున్న విశ్వాస్..

**ఘనంగా వీడ్కోలు పలికిన, జర్నలిస్టులు,ఆత్మీయ మిత్రులు..**



**కౌల్చారం,జులై13(సూర్యరేఖ)**మెదక్ జిల్లా కౌల్చారం మండలం గ్రామానికి చెందిన జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గా (ఈనాడు) వెలుగు దినపత్రికల్లో పనిచేస్తున్న తిమ్మనగారి శ్రీధర్ కుమారుడు విశ్వస్ ఉన్నత చదువు కోసం ఆస్ట్రేలియా వెళుతున్న సందర్భంగా కౌల్చారం మండలం చెందిన ఆత్మీయ మిత్రులు,సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ కుమార్,బిజెపి మండల అధ్యక్షులు పంతులు హరీష్,కౌల్చారం మండల ప్రెస్ మిత్రులు కౌల్చారం మండలం సీనియర్ జర్నలిస్ట్ నాగభూషణం,శ్రీనివాస్ గౌడ్, ఆత్మీయ మిత్రులు ఘనంగా వీడ్కోలు పలికారు.

## తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండిస్తున్నాం

**సాట్లపల్లి శ్రీధర్**



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జూలై13(సూర్య రేఖ)** బీసీల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న పై దాడి చేయడం హేయమైన చర్య అని మున్నూరు కాపు మండలాధ్యక్షుడు సాట్లపల్లి శ్రీధర్ అన్నారు.మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని ఆదివారం మున్నూరు కాపు మండలాధ్యక్షుడు సాట్లపల్లి శ్రీధర్ మాట్లాడుతూ..బీసీల కొరకు పోరాడుతున్న తీన్మార్ మల్లన్న పై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.బీసీల కోసం గళం విప్పి పోరాడుతున్న తీన్మార్ మల్లన్నపై కక్షగట్టి బీసీల ఐక్యతను విడదీయడానికే కొందరు అతనిపై దాడి చేశారని అతని దాడి కాకుండా అతనిపై కూడా దాడి చేయడం జరిగిందని,ఇలాంటి వాటిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం రాష్ట్రంలో బీసీలంతా ఏకమై పోరాడవలసిన సమయం వచ్చిందని బీసీలు మౌనం వీడి దాడి చేసిన వారిపై తమ సంఘ ఐక్యత కొరకు ఐక్యత లాభాల కొరకు పోరాటం మొదలు పెట్టాలని ఆయన తెలిపారు.

# బికినీలో.. మన్మథుడు అన్ను అందాల విందు



'తాగితే కదా.. నచ్చుతుందో లేదో తెలిసేది... అంటూ మన్మథుడు సినిమాలో మృదు మధుర స్వరం, అమాయకత్వంతో ఆకట్టుకున్న అన్ను ఇప్పుడు మాత్రం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో గ్లామర్ షోతో నెట్టింట రచ్చ చేస్తోంది. రెండు దశాబ్దాల క్రితం నాగార్జున మన్మథుడు సినిమాతో ఎంట్రీ ఇచ్చి చేసిన రెండు మూడు సినిమాలతోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చుకున్న ఈ నటి ఆ చిత్రం తర్వాత ప్రభాస్‌తో రాఘవేంద్ర, తమిళంతో ప్రశాంతో ఓ సినిమా తెలుగులో గెస్ట్ పాత్రల్లో మాత్రమే నటించిన ఈ ముద్దుగుమ్మ ఆపై రీర్ ఊపందుకుంటున్న సమయంలోనే పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లి పోయింది. ఇటీవల సందీప్ కిషన్, రావు రమేశ్ మజాకాతో తిరిగి సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చింది. కానీ మూవీ అంతగా విజయవంతం కాకపోవడంతో ఏవైనా ఛాన్సులు వస్తే వస్తా అన్నట్లు విదేశాలకు తిరిగి వెళ్లిపోయింది. అయితే పెళ్లై ఇద్దరు పిల్లలున్నా ఈ అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌ను సంపాదించుకుంది. తాజాగా తన భర్త , పిల్లలతో కలిసి దుబాయ్ ట్రిప్‌కు వెళ్లిన ఈ భామ అక్కడ ఓ ఖరీదైన హెూటల్‌లో బస చేసి, స్విమ్మింగ్ పూల్‌లో సేద తీరుతూ అందాలు ఆరబోస్తూ అభిమానులకు సడన్ షాక్ ఇచ్చింది. ఆ ఫొటోలు చూసిన వారంతా అన్నును ఇంత హాట్‌గా ఎన్నడూ చూడలేదంటు కామెంట్లు చేస్తున్నారు. సినిమాల్లోనూ ఎప్పుడూ అందాల ప్రదర్శణ చేయని ఈ బ్యూటీ ఇప్పుడేంటీ ఇంతగా గ్లామర్ ట్రీట్ ఇస్తుందంటూ అనుకుంటున్నారు.

# క్లీవేజ్ అందాలతో విష్ణు ప్రియ రచ్చ



# సెన్సార్ పూర్తి చేసుకున్న 'మై బేబీ' జూలై 18న గ్రాండ్ రిలీజ్




ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన 'డి.ఎన్.ఎ' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబీ' పేరుతో ఈనెల జూలై 18న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ సెన్సార్‌ను పూర్తి చేసుకుంది. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి 15 విజయవంతమైన చిత్రాలను నిర్మాతగా అందించిన సురేష్ కొండేటి, డిస్ట్రిబ్యూటర్‌గా 85కు పైగా సినిమాలను విడుదల చేశారు. 'మై బేబి' ఆయన నిర్మాణంలో వస్తున్న 16వ చిత్రం. ఈ సినిమా కూడా భారీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధర్వ మురళి మరియు నిమిషా సజయన్ జంటగా నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వం వహించారు. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన ఒక దుర్ఘటన ఆధారంగా ఈ కథ రూపొందిందని చిత్ర బృందం తెలిపింది. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో కూడిన భావోద్వేగభరితమైన కథాంశం ఈ సినిమా ప్రత్యేకత అని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఎస్.కె. పిక్చర్స్ ద్వారా విడుదల చేయనున్నారు. సాయి చరణ్ తేజ పుల్లా, దుప్పటి గట్టు సారిక రెడ్డి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరించారు.



# బిగ్‌బాస్ షోలో ఛాన్స్ వస్తే వెళ్తారా? పీలింగ్స్ సింగర్ ఆన్సరిదే!

అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప 2 మూవీలో వస్తుండాయి పీలింగ్స్ పాట ఎంత సెన్సేషన్ అయిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ పాట కోసం సినిమా ఇండస్ట్రీలోని టాప్ సింగర్స్‌ను కాదని జానపద గాయని దాస లక్ష్మితో పాడించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం గన్నోర గ్రామానికి చెందిన లక్ష్మి చిన్నప్పటినుంచే ఫోక్ సాంగ్స్ పాడుతుండేది. పలు పాటల ప్రోగ్రామ్స్‌లోనూ పాల్గొనేది. యూట్యూబ్ వల్ల లక్ష్మి చాలా పాపులర్ అయింది.

**పుష్ప 2లో ఛాన్స్**

తిన్నా తీరం పడుతలే.. కూసున్నా తీరం పడుతలే.., ఆనాడేమన్నంటినా తిరుపతి.. నిన్ను ఈనాడేమన్నంటినా తిరుపతి వంటి పాటలు ఆమెకు బోలెడంత పేరు తెచ్చిపెట్టాయి. ఇంకేముంది, దర్శకుడు సుకుమార్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్.. లక్ష్మి టాలెంట్ గురించి తెలుసుకుని వెంటనే పుష్ప 2లో ఛాన్స్ ఇచ్చారు. అలా ఆమె వస్తుండాయి పీలింగ్స్ పాట పాడింది. అంతకుముందు బ్యాచ్ మూవీలో ఓ పాట, దసరాలో ధూమ్ ధామ్ దోస్తాన్ సాంగ్ పాడింది.

**బిగ్‌బాస్ నుంచి ఆఫర్ వస్తే..**

బిగ్‌బాస్ షోలో ఛాన్స్ వస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు లక్ష్మి తాజాగా ఇలా స్పందించింది. బిగ్‌బాస్ షోకి వెళ్లాలన్న ఆలోచనే రాలేదు. ఎందుకంటే నా భర్త, ఏడాదిన్నర పిల్లాడే నా ప్రపంచం. వారిని విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్లలేను. బాబు ఇంకా చిన్నవాడు కాబట్టి దుబాయ్, మస్కట్ వంటి దేశాల్లో మూడు, నాలుగు రోజుల ప్రోగ్రామ్స్ ఉంటేనే వెళ్లలేకపోతున్నాను. నేను బిగ్‌బాస్ షో చూస్తూ ఉంటాను. ఒకవేళ ఛాన్స్ వస్తే వెళ్లడానికి ప్రయత్నిస్తాను అని లక్ష్మి చెప్పుకొచ్చింది.



# శ్రీకృష్ణ దేవరాయ బయోపిక్‌లో రిషబ్ శెట్టి?

కాంతార సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు రిషబ్‌శెట్టి ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌లను ఓకే చేస్తున్నాడు. ఇప్పటికే కాంతార ప్రీక్వెల్‌ను తెరకెక్కిస్తున్న రిషబ్ మరోవైపు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ పాత్రలో రాబోతున్న ఒక సినిమాలో నటించబోతున్నాడు. అయితే ఈ రెండు ప్రాజెక్ట్‌లే కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను రిషబ్ శెట్టి చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అశుతోష్ గోవారికర్‌తో కలిసి రిషబ్ ఒక భారీ చారిత్రక చిత్రంలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆంధ్ర భోజుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కబోతుంది. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. "పానిపట్", "జోధా అక్బర్", "మొహెంజోదారో", "లగాన్" వంటి హిస్టారికల్ చిత్రాలను తెరకెక్కించిన అశుతోష్ గోవారికర్ శ్రీకృష్ణదేవరాయలు బయోపిక్ తీస్తున్నట్లు వార్తలు వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,